ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 19 జూన్ 2025

రామలింగేశ్వరుడికి
వైభవంగా చిలుక వాహనసేవ



చిలుక వాహనంపై ఊరేగుతున్న ఆది దంపతులు

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు చిలుక వాహనంపై ఊరేగారు. తానే లోకంలో అందగాడినని గర్వంతో ఉన్న మన్మథుడిని, శివుడు తన మూడో నేత్రంతో దహించి గర్వభంగం చేస్తాడు. భౌతిక సౌందర్యం కన్నా, భక్తి గొప్పదని భక్తులకు చాటేందుకు రతీమన్మథుడి రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన చిలుక వాహనంపై అధిరోహించి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు కొమారి వేణుగోపాల్ మత్స్యకార యూత్ వారు పూలంగి సేవను ఘనంగా జరిపారు. తదుపరి స్వామి,అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన చిలుక వాహనంపై రామతీర్థం, లక్ష్మీపురం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవానికి పొన్నపూడి పెద్దపాళేనికి చెందిన కొమారి రాము ఉభయకర్తగా వ్యవహరించారు. భక్తులకు లక్ష్మీపురానికి చెందిన గ్రామకాపులు కొండూరు సుబ్రహ్మణ్యం, రంగంగారి వెంకటేశ్వర్లు, గోవిందు అన్న సంతర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సురేష్, గుమస్తా వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. బదిలీలను సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా, డీఈవో ఎక్స్ అఫిషియోగా, సమగ్రశిక్ష ఏపీసీ సభ్యులుగా, డైట్ ప్రిన్సిపల్, డిప్యూటీఈవో, జీసీడీవోలను సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ బీశ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి గురువారం (నేటి) నుంచి ఈనెల 21వతేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న సీనియారిటీ జాబితా రూపకల్పన, 24న జాబితాల ప్రదర్శన, 27న అభ్యంతరాల స్వీకరణ, 28న ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రదర్శించనున్నట్లు ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈనెల 30 నుంచి జూలై 2వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టేషన్ పాయింట్ల వారీగా నిబంధనలను అనుసరించి బదిలీలు చేపడతారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కేజీబీవీల బోధన, బోధనేతర సిబ్బంది, ఐఈఆర్‌పీలు, పార్ట్‌టైమ్ బోధకులు, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు, మండలస్థాయి అకౌంటెంట్‌లు, సైట్ ఇంజనీర్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసేంజర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీసీ తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆమంచర్ల కత్తి.. రైతులకు భలే ఆసక్తి!

- 50 గ్రామాలకు వ్యవసాయ పనిముట్లు ఇక్కడే తయారీ
- 'కనరాతి' కుటుంబానికి 120 ఏళ్లుగా ఇదే జీవనాధారం
- పొరుగు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



ఇనుక కడ్డీని ఎర్రగా కాల్చి కత్తిని తయారు చేస్తున్న కొలిమిపనివాళ్లు

రైతన్న కొడవలి పట్టాలన్నా.. గీత కార్మికుడు కత్తితో గొల కోయాలన్నా.. గొడ్డళ్లతో కూలీలు చెట్లు నరకాలన్నా.. అల్లె కత్తులతో బుట్టలు అల్లాలన్నా.. ఎడ్ల బండ్లకు పట్టాలు వేయాలన్నా.. మొద్దు కత్తులతో కంపచెట్లు కొట్టాలన్నా నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్ల గ్రామానికి రావాల్సిందే. చుట్టుపక్కల 50 గ్రామాలలో వ్యవసాయ అనుబంధ పనిముట్లు ఏవైనా సరే 'కనరాతి' కుటుంబం చేసిన సామగ్రే దిక్కు. 120 ఏళ్లుగా ఆ కుటుంబాలు కొలిమి వృత్తినే జీవనాధారంగా మలుచుకున్నాయి. వీరి చేతుల్లో తయారైన పదునైన కత్తులు మన రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలకూ ఎగుమతి అవుతుంటాయి.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

8 లో..

అన్నదాతలకు ఆర్థిక భరోసా

- జిల్లాలో 1.77లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ'
- ఇప్పటికే 98శాతం ఈకేవైసీ పూర్తి
- ఇక మిగిలింది రెండురోజులే...!
- నెలాఖరులోపు ఖాతాల్లో నగదు జమ

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీ భవ పథకం అమలుకు కార్యాచరణ రూపొందించింది. ఈ నెలాఖరులోపు కర్షకుల ఖాతాల్లో మొదటి విడత నిధులు జమ చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఈ పథకం కింద దాదాపుగా 1.77లక్షల మంది రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ఈ మేరకు జాబితాను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఇప్పటికే 98శాతానికి పైగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రెండు శాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

మూడు విడతల్లో సాయం

అన్నదాత సుఖీభవ, పీఎం.కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. పీఎం.కిసాన్ రూ.6వేలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14వేలు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో అందించేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో రూ.2వేల చొప్పున రూ.6వేలు అందించ నున్నది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల చొప్పున రెండు విడతలు మరో విడతలో రూ.4వేలు జమ చేయనున్నట్లు సమాచారం. ఈనెలలోనే రైతులకు సాయం అందే అవకాశాలు ఉన్నాయి.

రేపటితో గడువు పూర్తి



రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకా నికి 1.77లక్షల కుటుంబాల జాబితా సిద్ధం చేశాం. ఇందులో సుమారుగా 1,73,652 మంది కుటుంబాలకు అంటే 98శాతానికి పైగా ఈకేవైసీ పూర్తయింది. మిగిలిన 3,348 మంది కుటుంబాలకు చేయాల్సి ఉంది. ఈనెల 20వతేదీ వరకు ప్రభుత్వం సమయం ఇచ్చినందున నూరు శాతం ఈకేవైసీ పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

అర్హులుగా 1.77లక్షల మంది

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 1.77లక్షల మంది రైతు కుటుం బాలకు సాయం అందనుంది. జిల్లాలో మొత్తం 3.19లక్షల రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అందులో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి సర్వే నెంబరును పరిశీలిం చడం, ఆర్‌టీజీఎస్ పరిశీలనల అనంతరం కుటుంబం యూనిట్‌గా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పథకానికి అర్హత ఉందో లేదో తెలుసుకునేందుకు 'చెక్ స్టేటస్' అనే ఆప్షన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి వారి ఆధార్ నెంబరు నమోదు చేస్తే అర్హుల వివరాలు కనిపిస్తాయి.

- 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఎత్తుకెళ్లినట్లు నిర్ధారణ
- రూ.231కు బదులుగా రూపాయి చెల్లించి దోపిడీ
- రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు
- పోలీసు విచారణలో వెలుగులోకి అక్రమాలు
- కాకాణి కోసం పీటీ వారెంట్ వేసిన వెంకటాచలం పోలీసులు
- పరారీలో పలువురు వైసీపీ నేతలు



కనుపూరు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు(ఫైల్)

'కనుపూరు'లో
దోపిడీ రూ.30 కోట్లు

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదని పెద్దలు ఊరికే అనలేదు. కనుపూరు చెరువు విషయంలో ఇప్పుడు అదే జరుగుతోంది. నాడు వైసీపీ ప్రభుత్వంలో అధికారమే అండగా సాగిన దోపిడీకి నేడు అక్రమార్కులు మూల్యం చెల్లించుకుంటున్నారు. రైతులు గగ్గోలు పెట్టినా, ప్రతిపక్షాలు గోల చేసినా, ప్రజలు బహిరంగంగా విమర్శలు చేసినా.. నాడు మట్టి అక్రమార్కులు ఏ మాత్రం జంకలేదు. కనుపూరు చెరువులో భారీ ఎత్తున మట్టిని తవ్వి, లేఅవుట్లకు అమ్ముకొని సొమ్ముచేసుకున్నారు. ఈ అక్రమాలపై ఇప్పుడు రైతులు వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ వేగవంతంగా జరుగుతోంది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏ2గా మందల వెంకటశేషయ్య, ఏ3గా అల్లంపాటి నిరంజన్‌రెడ్డిలను చేర్చారు. వారం క్రితం వెంకటాలం పోలీసులు నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయం నుంచి రికార్డులు తీసుకెళ్లారు. ఆ తర్వాత కనుపూరు చెరువులో జరిగిన తవ్వకాలను సాంకేతికత సాయంతో లెక్కించారు. దాదాపు 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసినట్లు నిర్ధారించారు. అయితే అనుమతులు మాత్రం రూ.2.30 లక్షల క్యూబిక్ మీటర్లకే ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ రికార్డులు చెబుతుండడం గమనార్హం.

ప్రభుత్వ విలువే రూ.30 కోట్లు..!

చెరువుల్లో మట్టిని రైతులు సొంత అవసరాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పొలాలను మెరక చేసుకునేందుకు క్యూబిక్ మీటర్‌కు రూపాయి చెల్లించి మట్టిని తవ్వి తీసుకెళ్లవచ్చు. ఇందుకు రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ అవసరమవుతుంది. అయితే కమర్షియల్ అవసరాలకు మాత్రం క్యూబిక్ మీటర్‌కు రూ.231 చెల్లించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వంలో రైతుల మాటను వైసీపీ నేతలు మట్టి దోపిడీ చేశారు. కనుపూరు చెరువు కింద ఉన్న కొందరు రైతుల పాసుపుస్తకాలను సంపాదించి, వారి సంతకాలు ఫోర్జరీ చేసి ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులకు రెవెన్యూ అధికారుల ధ్రువీకరణపత్రం కూడా లేదు. అయినా ఇరిగేషన్ అధికారులు అనుమతులు మంజూరు చేసేశారు. ఇలా రూపాయి లెక్కన చెల్లించి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని లేఅవుట్లకు తరలించారు. పోలీసుల విచారణలో 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వినట్లు తేలింది. అంటే రూ.231 లెక్కన చూసుకుంటే సుమారు రూ.30 కోట్ల మేర ప్రజాధనాన్ని దోచుకున్నట్లు లెక్క. కానీ మార్కెట్లో ఇంకా

- మిగతా 8వ పేజీలో

రేపే బార్ అసోసియేషన్
ఎన్నికలు

- త్రిముఖ పోటీలో గెలుపెవరిదో...?

నెల్లూరు (లీగల్), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. అసోసియేషన్‌లో మొత్తం న్యాయవాదులు 2,507మంది ఉన్నారు. అయితే బార్ కౌన్సిల్ పంపిన ఓటర్ల జాబితా ప్రకారం అరియర్స్ కట్టని వారి పేర్లు పోను ఓటర్ల సంఖ్య 1,362గా ఉంది. ఒక ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సంయుక్త కార్యదర్శి ట్రెజరర్, లైబ్రరీ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లేడీ రెప్రజంటేటివ్, ముగ్గురు సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, ఐదుగురు జూనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నెంబర్ల ఎంపకకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా మూడు ప్యానళ్లు బరిలో ఉన్నాయి. వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్ష పదవికి ఈదూరు భాస్కరయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి నక్కల నాగరాజు, సంయుక్త కార్యదర్శి పదవికి కేఎల్. నారాయణ పోటీలో ఉన్నారు అలాగే ఐక్యవేదిక ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి వేళ్ల ఉపేంద్రరావు, ఉపాధ్యక్ష పదవికి జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎస్. అంకయ్య, సంయుక్త కార్యదర్శి పదవికి నాగేళ్ల రవిక్రిష్ణ పోటీలో ఉన్నారు. జాతీయ న్యాయవాద వేదిక తరఫున అధ్యక్ష పదవికి దాసరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్ష పదవికి బీఎస్.రంగరాజన్, ప్రధాన కార్యదర్శి పదవికి సీహెచ్.నవీన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పదవికి టీ బాబురెడ్డి పోటీలో ఉన్నారు. మిగతా పదవులకు కూడా అత్యధిక సంఖ్యలో న్యాయవాదులు పోటీ పడుతు న్నారు. ఇప్పటికే పోటీలో ఉన్న న్యాయవాదులు తమ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేశారు. ఈ దఫా ముక్కో ణపు పోటీ జరనుండడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఎన్నికల అధికారు లుగా సీనియర్ న్యాయవాదులు బీ.శ్రీనివాసన్, సీవీ.రత్నం వ్యవహరిస్తున్నారు. ఈనెల 20వతేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి ఏడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఓటింగ్‌కు వచ్చే న్యాయవాదులు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును తెచ్చు కోవాలని, పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు లేకుండా రావాలని నిబంధనలు విధించారు.

కమనీయం..
వెంగమాంబ కల్యాణం



వెంగమాంబ పేరంటాల కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

- వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమ ఊరేగింపు
- కనుల పండువగా ప్రదానోత్సవం
- నర్రవాడకు పోటెత్తిన భక్తులు



వెంగమాంబ దంపతులకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వెంగమాంబ, గురవయ్యనాయుడు కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు కల్యాణ వేదికపై ఆసీనులయ్యారు. తొలుత వెంగమాంబ ఉత్సవ మూర్తులను, ముత్యాల తలంబ్రాలను, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ప్రధాన ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. వెంగమాంబ, గురవయ్యనాయుడులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ అర్చకులు పట్టువస్త్రాలను సమర్పించారు.

ఊరేగింపుగా పసుపు, కుంకుమ

ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలించారు. స్వర్ణభారత్ ట్రస్టు ఛైర్మన్ దీపావెంకట్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబరాన్నంటిన ప్రదానోత్సవం

వెంగమాంబ పేరంటాలు ప్రదానోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి ప్రదానోత్సవం ప్రారంభమై నర్రవాడ

- మిగతా 7వ పేజీలో

సిఫార్సు లేఖకు సొమ్ములు

- ఒక్కొక్కదానికి రూ. 25 వేల నుంచి రూ.40 వేల వరకు వసూళ్లు
- ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో అక్రమాలు
- యూనియన్ నేతల రెకమండేషన్లపై నిరసనలు



ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం) జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో ఎన్నో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. బుధవారం జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో పలు అక్రమాలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించగా, ఏఎన్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏకంగా ఉద్యోగ సంఘాల సిఫార్సు లేఖలను ఏఎన్‌ఎంలకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు ఏఎన్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. తాము పని చేస్తున్న పీహెచ్‌సీలకు చాలా దూరంగా వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా లేఖలు

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా, అందులో 134 మంది ఏఎన్‌ఎంలు బదిలీ కావాల్సిఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ సిఫార్సు లేఖలను ఏఎన్‌ఎంలు బదిలీల దరఖాస్తులో జత చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ సిఫార్సు లేఖలకు ఒక్కొక్కరు రూ. 25వేల నుంచి రూ. 40 వేల వరకు సదరు యూనియన్ నేతలకు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే యూనియన్‌లో ఎలాంటి సభ్యత్వం లేక పోయినా , ఆఫీసు బ్యారర్లు అంటూ సిఫార్సు లేఖలు ఇవ్వటంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న చోటే ఏఎన్‌ఎంలు ఉండేందుకు, తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాలకు దగ్గరలోనే బదిలీ చేయించుకునేందుకు ఈ సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు వైద్యఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో చాలా మంది ఏఎన్‌లు బదిలీల జాబితాలో 50లోపు పేర్లు ఉన్నా, తుది జాబితాలో 100పైగా పేర్లు రావటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అయితే చాలా దూరంగా ఉన్న పీహెచ్‌సీలకు బదిలీ కావాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.

నెట్ పనిచేయక అవస్థలు

ఇదిలా ఉంటే జూమ్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుండటంతో ఉదయగిరి, సీతారామపురం, రాపూరు తదితర ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో కౌన్సెలింగ్‌లో ఎక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో నెట్‌వర్క్ సక్రమంగా ఉన్న ప్రాంతాలకు చేరకున్నారు. మరికొందరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ఆరోగ్య కేంద్రాల ఏఎన్‌ఎంల రాకతో ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. ఈ బదిలీల కౌన్సెలింగ్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది.

కాకాణి బెయిల్‌పై రేపు ఉత్తర్వు

నెల్లూరు (లీగల్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల నిషేధ చట్టం కేసుల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి బెయిల్‌పై బుధవారం ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణ జరిగింది. కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎన్. సరస్వతి బెయిల్‌పై ఉత్తర్వు నిమిత్తం కేసును శుక్రవారానికి వాయిదా వేశారు. కాగా అక్రమంగా గ్రావెల్ తరలింపు అభియోగాలపై సీబీసీఐడీ అధికారులు మాజీ మంత్రి కాకాణిపై పెట్టిన కేసులో పీటీ వారెంట్ కింద అరెస్ట్ చేసి, నెల్లూరు రెండవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరు పరిచారు. న్యాయాధికారి ఎల్. శైలజారెడ్డి జూలై 2 వరకు ఆయన్ను జ్యూడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

'ఉపాధి'లో రూ. 4.13 లక్షల అవకతవకలు



సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న అధికారులు

నెల్లూరురూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి):వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ఉపాధి నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పక్కదారి పట్టిన నగదును తిరిగి ఉపాధి హామీ ఖాతాల్లో జమ చేయాల్సిందిగా తేల్చారు.బుధవారం నెల్లూరురూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సామాజిక తనిఖీ అనంతరం వాస్తవాల వెల్లడి సభ నిర్వహించారు. ఇందులో డ్వామా పీ డీ గంగాభవానీ, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనుల్లో ఉపాధి హామీ నిధులు రూ. 4 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కతేల్చారు. ఇందులో రూ. 2.33 లక్షల విలువైన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. మరో రూ. 1.80 లక్షలు పంచా యతీరాజ్ శాఖ ద్వారా జరిగిన పనుల్లో లోపాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించినట్లు సభలో అధికారులు వెల్లడించారు. మొత్తంగా రూ. 4.13 లక్షలు అవకతవకలు జరిగినట్లు, వాటిని బాధ్యుల నుంచి రికవరీ చేయా ల్సి ఉందని తేల్చారు. ఈ సభలో ఏపీడీ గాయత్రీదేవీ, ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్ర కుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఖలీల్ పాల్గొన్నారు.

చాముండేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు

ఇందుకూరుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నం గ్రామంలో వున్న చాముండేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. అమ్మవారి హుండీల ద్వారా రూ. 3,22,985 భక్తులు కానుకగా సమర్పించగా, అన్నదానం ద్వారా రూ.43499 అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరుటూరు గ్రూప్ దేవాలయాల ఈఓ కవిత, కార్యనిర్వహణ అధికారి తాతా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9535
వెండి కిలో ధర	రూ. 112700
వెండి ఒక గ్రాము	రూ. 115.70

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● ఎంపీడీవో

కొడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో సుబ్బారావు అన్నారు. మండలంలో మానేగుంటపాడు గ్రామం పంచాయతీ పరిధిలో బుధవారం పారిశుధ్యంపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు సైడు కాలువలు లేక, రాత్రి సమయంలో వీధిదీపాలు వెలగక అవస్థలు పడుతున్నామని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని స్థానిక పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

నేత్రదానం

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ పరిధిలోని కామాక్షీ నగర్‌కి చెందిన బుట్ల రమణమ్మ(80) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. మనసేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతురాలి నేత్రాలను కుటుంబసభ్యులు మోడరన్ ఐ ఆసుపత్రికి దానం చేశారు. నేత్రాలను ఐ టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించారు.

ఇనమడుగులో 'పొలం పిలుస్తోంది'



ఇనమడుగులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

కోవూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమడుగులోని రైతుసేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి టీ రజని మాట్లాడుతూ ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. భూసారం పెరిగేందుకు పచ్చిరొట్ట పైర్లు, జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్వేతలేఖ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● వ్యర్థ జలాలతో మడుగులు ● గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం
● పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి

కమ్ముకుంటున్న 'పామాయిల్' కాలుష్యం!

ముత్తుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంటపాలెం పరిసర గ్రామాల్లో నెలకొల్పిన పామాయిల్ పరిశ్రమల కాలుష్యం హద్దులు దాటుతోంది. వాటి నుంచి వ్యర్థ జలాలను నేరుగా రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఫ్యాక్టరీ చుట్టూ మడుగులు కడుతున్న వ్యర్థ జలాల దాటికి చుట్టుపక్కల ప్రజలు, కార్మికులు బలవుతున్నారు. పామాయిల్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాల్లో రసాయన మిశ్రమాలు ఉండడం వల్ల ఈ నీటి నుంచి దుర్వాసన వెలువడుతోంది.

శుద్ధి ఏదీ?

నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీలోనే ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి వ్యర్థ జలాలను శుద్ధి చేసి బయటకు వదలాల్సి ఉంటుంది. వ్యర్థ జలాల పారుదల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయాలి. అయితే కర్మాగారాల యాజమాన్యాలు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నాయి. ఫలితంగా మురుగు, రసాయనాలతో కూడిన జలాలు మడుగులుగా నిలిచిపోతు న్నాయి. ముఖ్యంగా పోర్టు రహదారికి కొంచెం దూరంలో ఉన్న రెండు పామాయిల్ పరిశ్రమల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వీటి నుంచిఇ వస్తున్న దుర్వాసన కారణంగా పరిశ్రమలో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యర్థ జలాల కారణంగా పలువురు అనారోగ్యం పాలవుతున్నారు.



రోడ్డు పక్కనే మడుగులా మారిన వ్యర్థ జలాలు

ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులు, అలెర్జీ, చర్మ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యాలు చెప్తున్న మాటలు వాస్తవ రూపంలో కనిపించడం లేదు.

అమలుకాని హామీలు

పరిశ్రమల ఏర్పాటు సమయంలో యాజమాన్యాలు పలు హామీలు ఇచ్చాయి. పరిసర గ్రామాలకు మౌలిక వసతులు కల్పిస్తామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడమే తప్ప ఆచరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థానికుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహిస్తామని, వైద్యశాల ఏర్పాటు చేసి తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామని చేసిన వాగ్దానాలను గాలికి వదిలేశాయి. నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేసినా నేరుగా పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడుకుని తమ పబ్బం గుడుపుకుంటున్నారే తప్ప, చర్యలు శూన్యమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం పంటపాలెం పంచాయతీ భవనంపై వాయు కాలుష్య వివరాలను నమోదు చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేక ఈ పరికరాలతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పామాయిల్ పరిశ్రమల కాలుష్యం పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల్ని సన్మానించిన హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు

కోవూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాటూరు హైస్కూల్‌లో సేవలందించిన ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా పనిచేశారని ప్రధానోపాధ్యాయులు జీ వెంకటేశ్వర్లు నాయుడు తెలిపారు. మండలంలోని పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సేవలు అం దించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల్ని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన పోలోజి వెంకటరమణ, బదిలీపై వెళ్లిన పీడీ భీమతాటి వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు పర్వతరెడ్డి జనార్దన్‌రెడ్డి, కోవూరు కాలేబు, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, రవిశంకర్, సంక్షేమాధికారి నాగరాజు గత ఐదు సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేశారన్నారు. అనంతరం ఘనంగా సన్మానించారు. స్థానిక జేబీఆర్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు షరీఫ్, రమణయ్యలను డీఈఓ శ్రీనాయక్, ఎంఈఓ చెంచులక్ష్మి, టీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ సికందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి తదితరులు ఘనంగా సన్మానించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కోవూరులో యోగా సాధకుల ప్రదర్శన

కోవూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం నుంచి బజారు కూడలి వరకు యోగా సాధకులు ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనను ఎంపీడీఓ సీహెచ్ శ్రీహరిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా యోగా గురువు గోళ్ళ జనార్దన్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు రవి, గోపాలకృష్ణ, ప్రసన్న, సలీమ్, ఈవీ రమణయ్య మాట్లాడారు. ప్రదర్శనలో సత్యాన్వేషణ చైతన్య ధ్యాన ప్రశాంతి నిలయం, శ్రీకృష్ణ ధ్యాన యోగ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్య పద్ధతులను పాటించినప్పుడే ఖర్చులు తగ్గి లాభాలు వస్తాయని వ్యవసాయాధికారి లక్ష్మీ రైతులకు సూచించారు. వరిణి, రామతీర్థం పంచాయతీలలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. టీడీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్, మద్దులూరు రాజ, ఉప్పాల వెంకటరమణయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది మహేష్, సౌజన్య పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



తోటపల్లి గూడూరు, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి) : తోటపల్లి గూడూరు మండలం తహసీల్దారుగా బీ పద్మావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పద్మావతి ఇటీవలి బదిలీల్లో తిరుపతి కలెక్టరేట్ నుంచి తోటపల్లి గూడూ రుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఇందు కు అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. కాగా, పద్మావతికి గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, వెంకటగిరి, నెల్లూరు కలెక్టరేట్‌లో పనిచేసిన అనుభవం ఉంది.

కండలేరు నీటిమట్టం 36.222 టీఎంసీలు

రాపూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 36.222 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2340 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిూస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 50 క్యూసెక్కులు, మొత్తం 2460 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఏఈ తెలిపారు.

బైక్ బోల్తా : ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం మోటర్ బైక్ బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరు నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన అశోక్, క్రాంతి కుమార్ కలిసి బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా తిక్కవర ప్పాడు క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పొలంబడి ఇన్‌చార్జి వ్యవసాయాధికారి పీ.వి జయభాస్కర్ సూచించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

● టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి



గ్రామస్థులతో మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డి

ముత్తుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి తెలిపారు. బుధవారం పోలంరాజు 'పంట గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో వారు పర్యటించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గ్రామస్థులతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికి వెళ్లే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వ్యవస్థలన్నింటిని గాడిలో పెడుతూ సుపరిపాలన అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

300 మంది చిన్నారులకు ప్రీప్రైమరీ పుస్తకాలు



పాఠ్యపుస్తకాలను కార్యకర్తలకు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ

మనుబోలు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని 300మంది చిన్నారులకు ప్రీప్రైమరీ పుస్తకాలను బుధవారం ఆయా కేంద్రాల కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అందజేశారు. మనుబోలు మెయిన్ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ పీపీ1 కింద నాలుగు పుస్తకాలు, పీపీ2 కింద నాలుగు పుస్తకాలు వచ్చాయని చెప్పారు. ఈ ఏడాది కొత్తగా కార్యకర్తలకు ప్రభుత్వం నుంచి మూడేసి శిక్షణ పుస్తకాలు ఇచ్చారన్నారు. ఆధార్ శిల, నవచేతన, ప్రీప్రైమరీ రైమ్స్, స్టోరీ బుక్‌లు వచ్చాయన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారత్ గుర్తింపు

● బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ఆర్ నాయుడు



అభివృద్ధి పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎస్ఎస్ఆర్ నాయుడు

సైదాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పీఎం నరేంద్ర మోడీతో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు వచ్చిందని వెంకటగిరి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ మహిళలు స్వయం ఉపాధితో జీవనం కొనసాగిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షురాలు సరస్వతి, నియోజకవర్గ నాయకుడు సోమశేఖర్ రాజు, మండల నాయకులు పోలయ్య, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి బదిలీ వీడ్కోలు



ఏవీ సుధాకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ పాఠశాలల్లో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ ఇటీవల బదిలీ కావడంతో బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పొదలకూరు మండల విద్యాశాఖ అధికారి శోభనాద్రి, పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం చావా సురేష్, విద్యా కమిటీ చైర్మన్ ధనలక్ష్మీ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సుధాకర్ పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాలను వివిధ రంగాల్లో జాతీయ స్థాయికి తీసుకెళ్లారని ప్రశంసించారు. సుధాకర్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన కొత్త పాఠశాలకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దాత బోగోలు భాస్కర్‌రెడ్డి, విద్యా కమిటీ మెంబర్ శ్రీనివాసులు, హిందీ ఉపాధ్యాయిని దౌలత్ బేగం, పూర్వ విద్యార్థులు అశోక్, సూరి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్

● నలుగురు ఏఎన్ఎంల బదిలీ

మనుబోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీల ప్రక్రియను ఈ ఏడాది సులువుగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా పూర్తిచేశారు. గతంలో బదిలీలంటే కౌన్సెలింగ్ కోసం జిల్లా కార్యాలయాల వద్ద మూడు రోజుల పాటు పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానంలో గంటలోనే చేశారని ఆ శాఖ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నలుగురు ఏఎన్ఎంలు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ అయ్యారు. మనుబోలు ఏఎన్ఎం సుభాషిణి కసుమూరు పీహెచ్‌సీ చవటపాళెం గ్రామానికి, చెర్లోపల్లి ఏఎన్ఎం మాధవి మైపాడు పీహెచ్‌సీ సోమరాజుపల్లికి, మడమనూరు ఏఎన్ఎం మల్లీశ్వరి కసుమూరు పీహెచ్‌సీ తిప్పవరప్పాడుకు, బద్దెవోలు ఏఎన్ఎం వనజ ఇసుకపాళెం పీహెచ్‌సీ పూడిపర్తి గ్రామానికి బదిలీ అయ్యారు.

పాపిరెడ్డిపాళెంలో మొక్కల పెంపకం



పాపిరెడ్డిపాలెంలో మొక్కలు నాటుతున్న బొబ్బేపల్లి

తోటపల్లి గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపిరెడ్డిపాలెం పంచాయతీ హరిజనవాడలో బుధవారం జనసేన నాయకులు మొక్కలు నాటారు. పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం కారణంగా రాబోయే రోజుల్లో స్వచ్ఛమైన గాలిని కూడా కొనుక్కునే పరిస్థితులు ఏర్పడకుండా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రతీ కుటుంబం నాలుగు మొక్కలు నాటి వారి బిడ్డలతో పాటు సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S



జాతీయ రహదారిపై బోల్తాపడ్డ లారీ

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మద్దూరుపాడు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం అదుపుతప్పి లారీ బోల్తాపడింది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక నుంచి ఒరిస్సాకు క్యాబేజి లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో డైవైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీడ్రైవర్ కల్లు వీరయ్యను 108 వాహనంలో పట్టణలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో హైవే డివైడర్ గ్రిల్స్ ధ్వంసమైనట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు.

స్కూటీ అపహరణ

కావలి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలోని అన్నపుగుంట వీధిలో ఇంటి ముందు నిలిపిన స్కూటీ బుధవారం ఉదయం చోరీకి గురైంది. వైకుంఠపురంలో నివాసం ఉంటున్న బొద్దుపూరు రజని కుమార్తె అనూజ మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్తూ స్కూటీని ఇంటిముందు పార్క్ చేసి వెళ్ళింది. కాగా, బుధవారం స్కూటీ కనిపించకపోవడంతో బాధితులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయాల్లో చోరీ



చోరీ జరిగిన ఆలయం

వరికుంట పాడు(ఉదయగిరి రూరల్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు గ్రామ సమీపంలో వెలసి ఉన్న పోలేరమ్మ, చంగాలమ్మతల్లి ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. అటుగా వెళ్లిన స్థానికులు ఆలయాల ప్రధాన గేటుకు వేసిన తాళంతో పాటు హుండీలను పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి ఉంటారని, గతంలోనూ ఈ ఆలయాల్లో పలుమార్లు చోరీలు జరగడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జూన్18,(ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేని ఇంటర్ విద్యార్థిని చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నగరంలోని బీవీనగర్‌లో గల ఓ ప్రైవేట్ కళాశాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం వివరాలు.. నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సునీత, రమణయ్య దంపతులకు కుమార్తె సింధూజ (16)తోపాటు ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 16న రమణయ్య తన కుమార్తెను బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చేర్పించారు. సింధూజ తాను హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టంలేదని చెప్పడంతో తల్లిదండ్రులు మంగళవారం హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు. కుమార్తెకు సర్ది చెప్పి బుధవారం మళ్లీ కళాశాలలో వదిలివెళ్లారు. ఈ క్రమంలో తోటి విద్యార్థినులంతా భోజనం చేసేందుకు వెళ్లగా సింధూజ తన గదిలోకి వెళ్లి లోపల గడేసుకుని సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థినులు గది తలుపులు తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. దీంతో వారు కళాశాల సిబ్బందికి తెలియచేశారు. వారు బలవంతంగా తలుపులు తెరచి చూడగా అప్పటికే సింధూజ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుంది. కిందకు దించి చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని ఓ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళాశాల సిబ్బంది జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేయడంతో వారు హుటాహుటిన హస్పిటల్‌కు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తండ్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ముత్యాలయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఆయన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో మండల అధికారుల పనితీరు చాలా వెనుకబడి ఉందన్నారు. వీఆర్‌ఓలు, తహసీల్దార్ భూసమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం రికార్డులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా గయాళు, గ్రామ కంఠం భూములపై అర్జీలు వచ్చినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారం కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అధికారులు తప్పని సరిగా సమస్యలపై అవగాహన పెంచుకొని అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా యర్రారెడ్డిపాలెం, పెంట్రాల గ్రామాలలోని పంచాయతీ గ్రేజింగ్ భూములలో ఇంటి స్థలాలు ఇప్పించాలని ఆయా గ్రామస్థులు కోరారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎస్ఐ ఎం నారాయణ, ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515

వైభోగ క్షేత్రంలో అన్నదానం

నెల్లూరు రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుపల్లి పంచాయతీ సామంతులవారితోపులోని వైభోగ క్షేత్రం మూడో వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. మానవ సేవే మాధవ సేవ అన్న స్ఫూర్తితో ఈ క్షేత్రం నడుస్తోందని క్షేత్ర అధికారి మాతా సృజన భారతీ తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

మెప్మా నుంచి యోగాకు 68,500 మంది

నెల్లూరు(ఆంధ్రజ్యోతి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవానికి మెప్మా నుంచి 68500 మంది మహిళలను రిజిస్ట్రేషన్ చేయించామని మెప్మా పీడీ బాల లీలారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగా మీద స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వడానికి 799 మంది వలంటీర్లను ఎంపిక చేసి, ప్రతీ రోజూ శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఎంపికైనా మహిళలందరూ ఈనెల 21న కార్పొరేషన్, మున్సిపల్ వార్డులలో జరిగే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే 'అన్నదాత సుఖీభవ'

● ఏవో నాగమోహన్

నెల్లూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం అందచేసే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరాలంటే ముందుగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగమోహన్ తెలిపారు. బుధవారం దొంతాలి, అంబాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుత ఎడగారులో సాగుచేసిన వరి పైరులో కలుపు పోవాలంటే ఎకరానికి ఒక లీటరు బుటాక్లోర్‌గానీ, అర లీటరు ప్రేటిలెక్లోర్‌ను ఇసుకలో కలిపి చల్లాలని ఆయన తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

నెల్లూరు (జడ్పీ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 33-11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు విద్యుత్ శాఖ ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ, జడ్పీ కాలనీ, సంజయ్ గాంధీ నగర్, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

22న పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నేలపై విప్లవ విద్యార్థి ఉద్యమం ప్రారంభమై ఈ సంవత్సరానికి 50 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 22న గుంటూరులో పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఆ వేదిక సభ్యులు రాజశేఖర్, బ్రహ్మం, కొండయ్య, పౌర హక్కుల సంఘం నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సదస్సులో విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్ర, సాయుధ పోరాట సంస్థలతో ప్రభుత్వం గతంలో కుదుర్చుకున్న శాంతి చర్చల పూర్వాపరాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. పూర్వ విప్లవ విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సీహెచ్‌వి ప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సిరిపురపు సమీరారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కర్నూలు జిల్లా కోసిగి మోడల్ స్కూల్ నుంచి బదిలీపై సీతారామపురంకు వచ్చారు.



స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వర్ణాల చెరువులో పేరుకున్న గుర్రపు డెక్కాకును యంత్రాంగం తొలగిస్తోంది. జూలై 6 నుంచి రొట్టెల పండుగ ప్రారంభమవుతున్న నేపథ్యంలో చెరువులో విస్తరించిన గుర్రపు డెక్కాకు, బారా షహీద్ దర్గాలో ప్రాంగణంలో వ్యర్థాలపై 'రొట్టెల పండుగ అంటే కొందరికి పండుగే' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించచిన ఇరిగేషన్ శాఖ ఏఈ బాల సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో గుర్రపుడెక్కాకు తొలగింపు పనులు ప్రారంభించారు.

అనధికార నిర్మాణాలపై కొరడా

● జేమ్స్ గార్డెన్స్‌లో భవనం సీజ్

నెల్లూరు(సిటీ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనధికార భవన నిర్మాణాల పై కార్పొరేషన్‌కు చెందిన సిటీప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. నగరంలోని జేమ్స్ గార్డెన్స్‌లో ఓ అనధికార భవనాన్ని సీజ్ చేస్తూ బుధవారం హెచ్చరిక నోటీసులు అంటించారు. జీ+2 అంతస్తులకు అనుమతులు పొంది మరో మూడు అంతస్తులను అనధికారికంగా నిర్మించినట్లు గుర్తించారు. దీంతో యజమాని నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో తదుపరి చర్యల్లో భాగంగా భవనాన్ని సీజ్ చేస్తూ నోటీసులు అంటించినట్లు కమిషనర్ నందన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదేకాక, ఇద్దరు భవన యజమానులకు నిబంధనల అతిక్రమణ నోటీసులు జారీ చేసి కోర్టుకు తెలపగా వారికి న్యాయాధికారి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారని తెలిపారు. ఆ ఇద్దరి భవనాలకు రూ. 9 కోట్లు జరిమానాగానీ, మూడేళ్ల జైలు శిక్షగానీ పడే అవకాశాలున్నట్లు కమిషనర్ వెల్లడించారు. 11 అనధికార లేఅవుట్ల వారికి నోటీసులు జారీ చేశామని, వాటిలోని ప్లాట్లను 22-ఏ జాబితాలో చేర్పించి, రిజిస్ట్రేషన్లు ఆపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలో ఎవరైనా అనధికారికంగా భవనాలు నిర్మించినా, అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కాగా, బుధవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ఆరోగ్య విభాగం సమీక్షలో కమిషనర్ పాల్గొన్నారు. నగరంలో ఉన్న బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా మార్చాలని సూచించారు.



భవనానికి హెచ్చరిక నోటీసు అంటిస్తున్న సిబ్బంది

ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో బుధవారం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. సరస్వతీ సమాజం అభివృద్ధి కోసం నందమూరి బాల కృష్ణ అభిమాన సంఘం తరపున నుడా చైర్మన్ రూ.50వేలు విరాళం ప్రకటించారు. అలాగే ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఘాట్ వద్ద ఉన్న కర్మక్రియల భవనాన్ని నుడా నిధులు రూ.50వేలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. విజయభాస్కర్ రెడ్డి వీఆర్ హైస్కూల్ అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, పీ మధుసూదన్‌రావు, ఆనంద్, రవీంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భోజనశాలను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి, వేమిరెడ్డి తదితరులు



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

గంగిశెట్టి శివకుమార్‌కి అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌కి కేంద్ర సాహిత్య అకాడమీ బాలల సాహిత్య పురస్కారం ప్రకటించింది. దీంతో పలువురు కవులు, రచయితలు వేర్వేరు ప్రకటనల్లో ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ప్రతిష్టాత్మకమైనదని, శివకుమార్‌కు లభించడం జిల్లావాసులు గర్వించదగ్గ విషయమని కవి, విమర్శకుడు ఈతకోట సుబ్బారావు పేర్కొన్నారు. పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి అభినందనలు తెలిపారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

అధికారులు సమన్వయంతో సాగాలి : ఆర్డీవో

22 నుంచి శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, నుడా చైర్మన్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలని నెల్లూరు ఆర్డీవో అనూష సూచించారు. ఆమె అధ్యక్షతన ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం బుధవారం ఆలయంలో జరిగింది. అన్నీ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. మూడేళ్లకొకసారి జరిగే ఈ బ్రహ్మోత్స వాలు ప్రత్యేకమైనవని, జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారని తెలిపా రు. తాగునీరు, పారిశుధ్యం, భద్రతతోపాటు 24/7 విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం బ్రహ్మోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్క రించారు. ఆలయ ఈవో జానకి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి జూలై 15 వరకు 21 రోజులు జరుగుతాయని తెలిపారు. జూలై 5న తపస్సుమాను ఉత్సవం, 13వతేదీ అగ్నిగుండ ప్రవే శం వేడుకలు ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమి షనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శేషవాహనంపై గురువాయురప్పన్

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మీ, గోదా సమేత గురువాయురప్పన్ మహావిష్ణు బుధవారం రాత్రి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణం జరిగింది. ఉత్సవాలకు దేవతలను ఆహ్వానిస్తూ గరుడ పటాన్ని ఎగురవేశారు. భక్తులకు కొడిముద్దలు పంచారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా పీటీ జగన్నాథం దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



శేషవాహన అలంకారంలో స్వామి, అమ్మవారుల, పూజలు చేస్తున్న అర్చకులు

మంత్రి ఆదేశాలు.. రంగంలోకి దిగిన అధికారులు

ఆత్మకూరు, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి) : రాజు ఆదేశిస్తేగాని తత్వం బోధపడదు.. అనే చం దంగా వరుసగా రోడ్డు ప్రమా దాలు జరుగుతున్నా స్పందించని సంబంధిత అధికారులు.. మంత్రి ఆనం ఆదేశాలతో రంగంలోకి దిగారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్ 67 రహ దారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేషనల్ హైవే అథారిటీ అధికారులకు తాఖీదు జారీ చేయడంతో అధికారుల్లో చలనం వచ్చింది. బుధవారం ఆయా శాఖల అధికారులు పట్టణ సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల విభాగం జిల్లా పీడీ వీకే చౌదరి మాట్లాడుతూ వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాల తీరు తెన్నులను పరిశీలిస్తే అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడం తదితర కారణాలు కనిపిస్తున్నాయన్నారు. వేగనియంత్రణ, తదితర అవసరమైన భద్రతా చర్యలు వెంటనే చేపట్టి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, డీటీసీ చందర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, ఏఈ అమానుల్లా, ఎస్‌ఐలు షేక్ జిలాని, బీ. సాయిప్రసాద్, ఎంవీఐ ఎం రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల జోలికొస్తే ఊరుకోం!

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించాలనుకుంటే తాటతీస్తానని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం నగరంలోని 18, 19, 20 డివిజన్లలో 14 పార్కు ల ఆధుని కీకరణ, నిర్మాణ పనులకు స్థానికులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్కుల ఆధునీకరణతో సుమారు రూ.150కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు కబ్జా కాకుండా కాపాడుతున్నామని చెప్పారు. ప్రజల ఆహ్లాదానికి రూ.7 కోట్లతో 29 పార్కులను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో చంద్రన్న పార్కులబాట పేరిట కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినితో కొబ్బరికాయ కొట్టిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మాకూ 'తల్లికి వందనం' ఇవ్వండి...!

● పారిశుధ్య కార్మికుల ఆందోళన



తమకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. సంక్షేమ పథకాల్లో తమకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పెంచల నరసయ్య, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

కమనీయం.. వెంగమాంబ కల్యాణం

(5వ పేజీ తరువాయి)

వీధుల గుండా సాగింది. భజనలు, బైనడీల నృత్యాలతో అంగరంగ వైభవంగా ప్రదానోత్సవం చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● **పోటెత్తిన జనం**

బుధవారం జరిగిన వెంగమాంబ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.అగ్నిగుండంలో కొబ్బరి వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు కానుకలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకొన్నారు.

● **నేడు పొంగళ్లు**

వెంగమాంబ తిరునాళ్ల చివరి రోజైన గురువారం ఉదయం పొంగళ్లు, బండ్ల తిరుగుట, సాయంత్రం బండలాగుడు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



వడ్డిపాళెం నుంచి ఊరేగింపుగా పసుపు, కుంకుమ తీసుకొస్తున్న భక్తులు

బుజబుజ నెల్లూరులో
కర్మక్రతువుల షెల్టర్ నిర్మాణం



శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని బుజబుజ నెల్లూరులో రైస్ మిల్లు సమీపాన కర్మక్రతువుల షెల్టర్ నిర్మాణం కోసం కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి బుధవారం భూమి పూజ చేశారు. స్థానికులు కర్మక్రతువులు చేసుకునేందుకు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకుడు గిరిధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ స్థలాన్ని కర్మక్రతువుల షెల్టర్ కోసం కేటాయించారని చెప్పారు. నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కోక్లస్టర్ ఇన్‌చార్జి పిగిళం నరేష్, డివిజన్ అధ్యక్షుడు శేష యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నాయకులు నగళ్ల రామకృష్ణ, దొడ్డక రమేష్, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఉద్యోగాలకు ఐటీఐ విద్యార్థుల ఎంపిక



నియామక పత్రాలు అందుకున్న కళాశాల విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల విద్యార్థులు పలువురు క్యాంపస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కే.ఏడుకొండలు తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో బాలికల ఐటీఐతోపాటు సంగం, ఏఎస్‌పేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలల నుంచి మొత్తం 160 మంది పాల్గొన్నారని ఆయన వివరించారు. శ్రీసిటీకి చెందిన బ్లూస్టార్, నాయుడుపేట సెజ్‌కు చెందిన గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, శ్రీకాళహస్తికి చెందిన ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ కంపెనీ, బెంగళూరుకు చెందిన యామ్‌ఫినోల్ కంపెనీలు డ్రైవ్ నిర్వహించి అర్హత, ప్రతిభ కలిగిన 132 మంది విద్యార్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘కనుపూరు’లో దోపిడీ రూ.30 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ ధరకు విక్రయించారు. ఒక ట్రిప్పర్ 15 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకెళుతుండగా, ఆ ట్రిప్పర్ విలువ రూ.8 వేలకు పైగా పలికింది. ఇక్కడా ఒక ట్రిప్పర్ రవాణా చార్జీలు పోను రూ.2 వేల వరకూ మిగుల్చుకున్నారు. ఇలా రూ.కోట్ల ప్రజాధనాన్ని అక్రమార్కులు జేబుల్లో వేసుకున్నారు. నిబంధనల ప్రకారం మీటర్ లోతుకు మించి తవ్వకూడదు. కానీ కనుపూరు చెరువులో పది మీటర్ల లోతుకు పైగా తవ్వి చెరువును గుల్ల చేశారు.

● కాకాణి కోసం పీటీ వారెంట్

వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఈనెల 7న కనుపూరు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 379, 409, 465, 467, 471, 506, 109, 120(బీ) రెడ్‌విత్34 ఐపీసీ, 21(1), 21(4) ఎంఎండీఏఆర్ఐ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీటిలో నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్నాయి. ఈ కేసు విచారణ చాలా వరకూ పూర్తి కాగా, అనేక మందిని విచారించారు. నాడు మట్టిని రవాణా చేసిన ట్రిప్పర్ల యజమానులను పిలిచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఇరిగేషన్ అధికారులను విచారించారు. ఈ నేపథ్యంలో తదుపరి ఏ1గా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విచారించేందుకు పోలీసులు కోర్టులో బుధవారం పీటీ వారెంట్ వేశారు. ఈ నెల 28లోపు దీనిపై కోర్టు విచారించనుంది. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురు వైసీపీ నేతలు పరారీలో ఉన్నారు. వారు విచారణకు హాజరుకాకపోతుండడంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కేంద్ర బృందం ‘ఉపాధి’ పనుల పరిశీలన



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులను బుధవారం కేంద్ర జల కమీషన్ బృంద సభ్యులు ప్రదీప్‌కుమార్, రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో చెక్‌డ్యాంల్లో కూలీలు చేసిన పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే ఉదయగిరి పట్టణంలోని యాదవపాళెం, ఎస్టీ కాలనీల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రమణ, ప్రసన్న, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 2 లక్షల విరాళం



ఆర్థిక సాయం అందిస్తున్న దాత భరత్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు రూ2 లక్షల విరాళం అందించారు. బుధవారం దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష, గంగా కన్యాకుమారి రూ.లక్ష సాయం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డికి ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలకమండలి కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కేన్సర్ ఆసుపత్రి కో కన్వీనర్ కమలేష్ జైన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, రేడియేషన్ శాఖ హెచ్‌వోడీ డాక్టర్ గీత ఉషశ్రీ, క్యాన్సర్ ఆసుపత్రి జీఎం భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ బడికే పంపుతాం !

● కాదంటే పాఠశాలకు తాళం వేస్తాం..

● కేఆర్‌పురం అరుంధతీ కాలనీ వాసుల ఆందోళన

మనుబోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను కాలనీలో ఉండే పాఠశాలకు తప్ప మరే పాఠశాలకు పంపలేమంటూ మనుబోలులోని కేఆర్ పురం అరుంధతీ కాలనీ వాసులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.... మనుబోలులో ఈ ఏడాది కొత్తగా రెండు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మర్చారు. మనుబోలు మోడల్ స్కూల్‌లో పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో మనుబోలు దళితవాడ, కేఆర్‌పురం గమళ్లపాళెం, కేఆర్‌పురం అరుంధతీ వాడ పాఠశాలలను అందులో మ్యాపిం గ్ చేశారు. అంటే ఈ పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులంతా ఈ మోడల్ స్కూల్‌కు రావాల్సి ఉంటుంది. మరో మోడల్ స్కూల్‌కు సరిపడా విద్యార్థులు ఉండడంతో బీసీ కాలనీ పాఠశాలను అందులో మ్యాపింగ్ చేయలేదు. అరుంధతీ వాడ పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థుల సంఖ్య 36 వరకు ఉంది. వారిని మోడల్ స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. పిల్లలను బడులకు పంపాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వచ్చి బతిమాలినా కాలనీ వాసులు నిరాకరించారు. దీనిపై తల్లిదండ్రులు మాట్లాడుతూ కాలనీ నుంచి మోడల్ స్కూల్ కిలోమీటరు దూరం ఉందని, చిన్న పిల్లలు రోడ్లుదాటుకుని అంత దూరం ఎలా వెళతారని ప్రశ్నించారు. అధికారులు పిల్లల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మ్యాపింగ్ చేయాల్సింది పోయి, ఎక్కడకంటే అక్కడకు పొమ్మంటే ఎలాగని నిలదీశారు. తమ కాలనీలో 1, 2 తరగతుల పిల్లలు 25 మంది ఉన్నారని చెప్పారు. తమ అభ్యర్థనను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని, లేకుంటే కాలనీలోని పాఠశాలకు తాళం వేస్తామని హెచ్చరించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈవో లేకపోవడంతో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌కు సమస్యను వివరించారు.




ఆందోళన చేస్తున్న మనుబోలు అరుంధతీవాడ కాలనీవాసులు

ఆమంచర్ల కత్తి.. రైతులకు భలే ఆసక్తి!

● 50 గ్రామాలకు వ్యవసాయ పనిముట్లు ఇక్కడే తయారీ ● ‘కనరాతి’ కుటుంబానికి 120 ఏళ్లుగా ఇదే జీవనాధారం

● పొరుగు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



అబ్బో.. ఎన్ని రకాల కత్తులో!

నెల్లూరు-పొదలకూరు మార్గంలోని ఆమంచర్ల గ్రామం రాగానే ప్రతి ప్రయాణికుడికి గుర్తుకువచ్చేది ఇక్కడ తయారయ్యే కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు ఇతర వ్యవసాయ పనిముట్లు. ఈ గ్రామంలోని ‘కనరాతి’కి చెందిన ఎనిమిది కుటుంబాలు సుమారుగా 120 ఏళ్లగా కొలిమి వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాయి. పూర్వీకుల ఆస్తిగా భావిస్తున్న ఆ కుటుంబ వారసులు కొలిమిని వీడకుండా అనేక వర్గాలవారికి అవసరమైన ఇనుప పనిముట్లను తయారు చేసి ఇస్తున్నారు. వరి కోతలకు వినియోగించే కొడవళ్లు, చెట్లు, మొద్దులు నరికే గొడ్డళ్లు, గీత కార్మికులు వాడే గీతకత్తులు, ఊరిచాకళ్ల వాడే సూరికత్తులు, ఎడ్ల బండి చక్రాలకు ఉపయోగించూ పట్టాలు, గిరిజనులు బతుకుదెరువు కోసం కంపచెట్లు, తాటాకులను కొట్టే మొద్దుకత్తులు, బుట్టల తయారీలో వాడే అల్లికత్తులు, మాంసపు దుకాణాల్లో ఉపయోగించే కత్తులు ఇలా అనేక వర్గాలు ఉపయోగించే ఏ ఇనుప వస్తువు అయినా ఆమంచర్ల కొలిమిలో తయారు కావాల్సిందే. ఆమంచర్లకు చుట్టూ ఉన్న సుమారు 50 గ్రామాలకు చెందిన అనేకమంది ఇక్కడ నుంచే తమకు కావాల్సిన వస్తువులను ఆర్డర్లు ఇచ్చి మరీ చేయించుకెళ్తుంటారు. కత్తుల రకాన్ని బట్టి ఒక్కో కత్తిని రూ.350 నుంచి రూ. 1,500 వరకు విక్రయిస్తుంటారు.

● పొరుగు ప్రాంతాలకు ఎగుమతి

ఆమంచర్లలోని కొలిమిలో తయారయ్యే ఇనుప వస్తువుకు స్థానికంగానే కాకుండా పొరుగు ప్రాంతాల్లోనూ మంచి గిరాకీ ఉంది. కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రైతులు, ఇతర వృత్తిదారులు ఇక్కడకు వచ్చి తమకు అవసరమైన ఇనుప వస్తువులను తయారు చేయించుకెళ్లడం విశేషం. నెల్లూరులోని ఆటోనగర్, రంగనాయకులపేట, విజయవాడ నుంచి ముడిసరుకు దిగుమతి చేసుకుని ఇనుప వస్తువులు తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఇక్కడ కిలో ఇనుమును రూ.100 నుంచి రూ. 400 లకు కొనుగోలు చేస్తారు. అక్కంపేట, రాపూరు, పంగిలి, ఓట్లపాళెం ప్రాంతాల నుంచి ఆమంచర్లలోని కొలిమి వద్దకు కూలీ పనులకు వచ్చి సమ్మెటకొట్టి రోజువారి రూ.800 సంపాదించుకు వెళ్లడం గమనార్హం.

● యంత్ర ప్రవేశంతో తగ్గిన గిరాకీ

అనేక రంగాలలో యంత్రాల ప్రవేశంతో తమకు గిరాకీ తగ్గిందని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రధానంగా వరికోత యంత్రాలు రావడం వల్ల వ్యవసాయ కూలీలకు పని తగ్గడంతోపాటు పైరును కోసే కొడవళ్ల తయారీ పూర్తిగా నిలిచిపోయింది. చెట్లను కొట్టేందుకు కూడా యంత్రాలు వచ్చేయడంతో గొడ్డళ్లకు పనిలేకుండా పోయింది. ఇక గ్రామాల్లో ఎడ్ల బండ్లు ఘననీయంగా తగ్గడంతో వాటి చక్రాలకు వాడే పట్టాల తయారీ పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతానికి మొద్దుకత్తులు, బుట్టఅల్లె కత్తులు, కల్లు గీత కత్తులు, మాంసపు దుకాణ కత్తులే తయారు చేస్తున్నట్టు చెబుతున్నారు.



● చేయూత కోసం ఎదురుచూపు

కొలిమి వృత్తినే నమ్ముకుని తమ జీవితాలను మాడి, మసి చేసుకుంటున్నా ప్రభుత్వాల నుంచి నేటికీ ఒక రూపాయి సహాయం కూడా అందలేదని ఆ వృత్తిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ వృత్తిదారులకు వారి అవసరాలకు తగ్గట్టుగా పనిముట్లను తయారు చేసి ఇస్తున్నా తాము మాత్రం సర్కారు వైపు నుంచి చేయూతను కోల్పోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వదులుకోలేక..



మా తాతల కాలం నుంచి ఈ వృత్తిలో మగ్గిపోతున్నాం. మాకు మరో పని తెలియదు. తెలిసినా వెళ్లలేం. తరతరాలుగా వస్తున్న ఈ వృత్తినే ఆస్తిగా భావించి వారసులకు అందించి ముందుకు నెట్టుకొస్తున్నాం. వారసత్వంగా వస్తున్న పనిని వదులుకోలేకనే ఇందులోనే ఉండిపోతున్నాం.

- కనరాతి రవి

నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తాం



చిన్నప్పుడు నుంచి మాకు తెలిసిన పని ఇదొక్కటే. బయటకు వెళ్లి మరో పని చేయలేక ఇక్కడే బాధలుపడుతున్నాం. మా దగ్గర తయారు చేసే ఇనుప వస్తువుకు పొరుగు ప్రాంతాలలో మంచి గుర్తింపు ఉంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వస్తువు చేయించుకుని వెళ్తుంటారు. మేము నాణ్యతకు మొదట ప్రాధాన్యం ఇస్తాం.

- సిందు వెంకయ్య

పాలకులు ఆదుకోవాలి!



ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ మా తలరాతలు మాత్రం మారడంలేదు. ఇప్పటి వరకు సర్కారు నుంచి రూపాయి సహాయం పొందలేదు. ఎవరెవరికో పథకాలు పెడుతున్నారు కానీ కొలిమి వృత్తిలోనే కుమిలిపోతున్న మాకు మాత్రం ఒక్క పథకం కూడా లేదు.

- కనరాతి పెంచలయ్య

రేపు డీకేడబ్ల్యూ కళాశాలలో ఉద్యోగ మేళా

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఉగ్యోగ మేళా జరగనుంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేళాకు 21 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులందరూ హాజరు కావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలు **naipunyam.ap.gov.in** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, యువత దీనిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

22న జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-16 బాలుర జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలని, సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రస్‌తోపాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని తెట్టు సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు.. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు... తెట్టు గ్రామానికి 100 మీటర్ల దూరంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన కొందరు గ్రామస్థులు గుడ్లూరు పోలీసులకు సమచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఆ వ్యక్తిని ఢీకొనడంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల లోపు ఉంటుందని, చొక్కా లేకపోగా లైట్ బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి ఆర్టీసీ డిపోమేనేజర్ ఆర్ శ్రీనివాసులు, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కలిగిరిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసీని ఆదరించి సేవలు పొందాలని సూచించారు. అదేవిధంగా బస్‌స్టేషన్‌లో కార్గో సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు లేక పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మండలి సభ్యుడు నందనవనం ప్రభాకరరావు, వాకా మాల్యాద్రి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అగ్రతాంబూలం

● ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్‌ఎస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చట్ట సభలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు.... రంగం ఏదైనా కూటమి ప్రభుత్వంలో బీసీలదే అగ్రతాంబూలం అని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్ అన్నారు. బుధవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన బీసీలకు స్వర్ణయుగంగా మారిందన్నారు. బీసీలపై దాడులు చేయాలంటే వణుకు పుట్టేలా బీసీ రక్షణ చట్టం రూపుదిద్దుకుం టోందని చెప్పారు. 2025-26 సంవత్సరంలో బీసీలకు రూ.47,457 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు నిలిపేసిందని, సబ్సిడీ రుణాలు రద్దు చేసి బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. నేడు బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం వచ్చిందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పీ ఎల్‌రావు, కొండూరు పాలిశెట్టి, పీ. ప్రదీప్, ఉప్పు భాస్కర్, కే. విజయమ్మ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై నేటి నుంచి స్క్రీనింగ్

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



స్క్రీనింగ్ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి సికిల్ సెల్(రక్తరుగ్మత) వ్యాధిగ్రస్థులను గుర్తించి స్క్రీనింగ్ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను బుధవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో ఆవిష్కరించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ జిల్లాలో 1,58,392 మంది గిరిజనులు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది సికిల్ సెల్ వ్యాధికి గురవుతున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి రెండు రోజులు స్క్రీనింగ్ చేస్తామని తెలిపారు. ఇంటి వద్ద, పీహెచ్‌సీల్లో ఏఎన్ఎంలు, ఆశాలు ఈ పరీక్షలు చేస్తారని వివరించారు. సికిల్ సెల్ వ్యాధి వల్ల రక్తహీనత, కీళ్ల నొప్పులు, చేతులు, కాళ్లలో వాపు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ రమేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు ఎంపీటీసీ ఎన్నికకు సిద్ధంగా ఉండాలి

● ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల జారీ

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ బిట్-1లో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ ఎన్నికకు మండల, రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. విడవలూరు ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికైన వేణుంబాక భవానమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఈ సెగ్మెంట్‌లో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈమేరకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేశారన్నారు. ఓటర్ల జాబితా సిద్ధంచేసి ఈనెల 30వ తేదీన పంచాయతీ, రెవెన్యూ, మండల కార్యాలయాల్లో ప్రచురించాలని ఎన్నికల కమిషన్, జిల్లాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

జయభారత్ ఆసుపత్రికి రూ.2లక్షల విరాళం



జయభారత్ ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలు

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి బుధవారం దాత రూ. 2లక్షల విరాళాన్ని అందించారు. బెజవాడ కృష్ణారెడ్డి 89వ జన్మదినం సందర్భంగా ఆయన తల్లిదండ్రులు రామచంద్రారెడ్డి, బుజ్జమ్మ జ్ఞాపకార్థం ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్రచికిత్సల కోసం ఈ విరాళాన్ని అందచేశారు. ఈ నిధులతో పేదలకు కంటి శస్త్రచికిత్సలు నిర్వహించాలని ఆసుపత్రి చైర్మన్ పొన్నవోలు సీతారామిరెడ్డిని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ దాత ఇచ్చిన విరాళంతో 100 మంది పేదలకు కంటి శస్త్రచికిత్సలు చేస్తామని, బుధవారం 10 మందికి శస్త్రచికిత్సలు చేశామని వెల్లడించారు.

కండలేరు ఈఈగా గజేంద్రరెడ్డి బాధ్యతల స్వీకరణ



రాపూరు, (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం కండలేరు డ్యాం శ్రీ సత్యసాయి, తెలుగు గంగ కండలేరు డివిజన్ నెంబర్- 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వీ గజేంద్రరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అంతకు ముందు వెంకటగిరి డివిజన్, నాయుడుపేట సబ్ డివిజన్ డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై కండలేరు ఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించడమే లక్ష్యం

విద్యుత్ ఎస్ఈ విజయన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు,(జడ్పీ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించటమే శాఖ ప్రథమ లక్ష్యమని, ఫిర్యాదులపై వినియోగదారులు ఫోన్ చేస్తే అధికారులు ఒపిగ్గా విని ఆ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరు నగర డివిజన్ అధికారులతో ఆయన విద్యుత్ భవన్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలు, అధికారులు, ఉద్యోగుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తోందని తెలిపారు. ఈ సర్వేలో ఎవరిపైన అయినా ఆరోపణలు వస్తే తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 61.6శాతం మాత్రమే నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోందని, 38.4 శాతం మేర అంతరాయాలు ఉంటున్నాయని చెప్పారు. వీటిని తగ్గించే దిశగా ప్రతీ అధికారి పని చేయాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కారించాలని సూచించారు. గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీ అవకాశం ఈనెల 30తో ముగుస్తుందని ఆయన చెప్పారు. ఈ విషయమై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ ఎం శ్రీధర్, డిప్యూటీ ఈఈలు ఆశోక్, సునీల్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పొలంబడి ఇన్‌చార్జి వ్యవసాయాధికారి పీ.విజయభాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం, గండిపాళెం రైతుసేవా కేంద్రాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల ప్రయోజనాలు, సేంద్రీయ ఎరువుల ఉపయోగాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణయ్య, ఏఈవో వినోద్, వీఏఏలు రహంతుల్లా, ఫయాజ్, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9535
వెండి కిలో ధర	రూ. 112700
వెండి ఒక గ్రాము	రూ. 115.70

ఇరిగేషన్‌శాఖ ఈఈగా రవి బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు డివిజన్ ఇరిగేషన్‌శాఖ డీఈఈ, ఇన్‌చార్జి ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్ వెంకటేశ్వర్లు పదోన్నతిపై ఒంగోలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలులో ఇరిగేషన్ డీఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం రవి ఇరిగేషన్ ఈఈగా ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ఆత్మకూరు డీఈగా పనిచేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన కాలనీకి చెందిన కరంగుల కాశీ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి బుధవారం తక్షణ సాయం కింద కాశీ భార్య జ్యోత్స్నకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సిరిపురపు సమీరారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కర్నూలు జిల్లా కోసిగి మోడల్ స్కూల్ నుంచి బదిలీపై సీతారామపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏపీఎం శారస్రవంతి

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వెలుగు కార్యాలయ ఏపీఎంగా శారస్రవంతి బుధవారం బాధ్యతలు స్వీక రించారు. నెల్లూరు డీపీఎం కార్యాల యంలో ఏపీఎంగా పని చేస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ధేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు.

మెప్మా నుంచి యోగాకు 68,500 మంది

● పీడీ లీలారాణి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవానికి మెప్మా నుంచి 68500 మంది మహిళలను రిజిస్ట్రేషన్ చేయించామని మెప్మా పీడీ బాల లీలారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగా మీద స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వడానికి 799 మంది వలంటీర్లను ఎంపిక చేసి, ప్రతీ రోజూ శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఎంపికైనా మహిళలందరూ ఈనెల 21న కార్పొరేషన్, మున్సిపల్ వార్డులలో జరిగే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● యాత్రాస్థలంలో కనపడని లెట్రిన్లు
● యాత్రికులకు తప్పని తిప్పలు

మరుగుదొడ్లు లేక అవస్థలు

ఏఎస్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్ర స్థలంగా పేరుగాంచిన ఏఎస్‌పేటలో మరుగుదొడ్లు లేకపోవడంతో యాత్రికుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గ్రామంలో ఖాజానాయబ్ రసూల్ దర్గా ఉండడంతో మన రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి మామూలుగానే వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాంటిది దర్గాలో ఉత్సవం జరిగితే ఇక లక్షల్లోనే..

కనపడని సామాజిక మరుగుదొడ్లు

మండల కేంద్రం కావడంతో పలు కార్యాలయాలకు వందల సంఖ్యలో ప్రజలు వారివారి పనుల నిమిత్తం వస్తుంటారు. దీంతో యాత్రికులు, గ్రామస్తులతో బస్టాండ్ ప్రాంతం నిత్యం రద్దీగా కనబడుతుంది. ఈ తరుణంలో కాలకృత్యలు తీర్చుకోవడానికి అవసరమైన సులభ్ క్యాంప్లెక్స్ వంటివి గ్రామంలో లేవు. రద్దీగా ఉన్న ప్రాంతంలో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి కాని అవి లేకపోవడంతో దర్గా దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యేవారు, బస్సుల కోసం వేచి ఉండే ప్రజలు అత్యవసరం అయితే వారి బాధ వర్ణణాతీతం. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు, పాఠశాలలకు వచ్చేవారు, బస్సుల కోసం వేచి ఉండేవారు తప్పని పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. అంతేకాకుండా బస్ షెల్టర్ సుమారు 10 సంవత్సరాల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి ప్రయాణికులు బస్సుల కోసం ఎండనక, వాననక బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు గ్రామంలో సామాజిక మరుగుదొడ్లు, బస్ షెల్టర్‌ను నిర్మించాలని యాత్రికులు, గ్రామస్తులు కోరుతున్నారు.



బస్సుల కోసం వేచి ఉన్న యాత్రికులు

బస్ షెల్టర్ శుభ్రం



శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి రూరల్, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయ గిరి బస్టాండ్ సెంటర్‌లోని బస్ షెల్టర్ శుభ్రతకు బుధవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అధ్వానంగా బస్ షెల్టర్' కథనానికి స్పందించిన ఈవో కరీముల్లా బస్ షెల్టర్‌ను పరిశుభ్రం చేయించారు. పారిశుధ్య కార్మికుల ద్వారా ఫినాయిల్‌తో కడిగించడంతో పాటు ప్రాంగణంలో పడేసి ఉన్న ఖాళీ మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ప్రజలు సైతం తమవంతు బాధ్యతగా బస్ షెల్టర్‌ను అపరిశుభ్రం చేయకుండా సహకరించాలని సూచించారు. దీంతో అటుగా వెళ్లిన ప్రజలు, ప్రయాణికులు హమ్మయ్యా.. ఎన్ని రోజులకు శుభ్రం చేయించారోనని పలువురు అనుకోవడం కనిపించింది.

C.R.I.M.E N.E.W.S



జాతీయ రహదారిపై బోల్తాపడ్డ లారీ

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మద్దూరుపాడు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం అదుపుతప్పి లారీ బోల్తాపడింది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక నుంచి ఒరిస్సాకు క్యాబేజి లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో డ్రైవైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీడ్రైవర్ కల్లు వీరయ్యను 108 వాహనంలో పట్టణలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో హైవే డివైడర్ గ్రిల్స్ ధ్వంసమైనట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు.

స్కూటీ అపహరణ

కావలి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలోని అన్నపుగుంట వీధిలో ఇంటి ముందు నిలిపిన స్కూటీ బుధవారం ఉదయం చోరీకి గురైంది. వైకుంఠపురంలో నివాసం ఉంటున్న బొద్దుహూరు రజని కుమార్తె అనూజ మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్తూ స్కూటీని ఇంటిముందు పార్క్ చేసి వెళ్లింది. కాగా, బుధవారం స్కూటీ కనిపించకపోవడంతో బాధితులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయాల్లో చోరీ



చోరీ జరిగిన ఆలయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు గ్రామ సమీపంలో వెలసి ఉన్న పోలేరమ్మ, చంగాలమ్మతల్లి ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. అటుగా వెళ్లిన స్థానికులు ఆలయాల ప్రధాన గేటుకు వేసిన తాళంతో పాటు హుండీలను పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి ఉంటారని, గతంలోనూ ఈ ఆలయాల్లో పలుమార్లు చోరీలు జరగడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జూన్18,(ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేని ఇంటర్ విద్యార్థిని చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నగరంలోని బీవీనగర్‌లో గల ఓ ప్రైవేట్ కళాశాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం వివరాలు.. నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సునీత, రమణయ్య దంపతులకు కుమార్తె సింధూజ (16)తోపాటు ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 16న రమణయ్య తన కుమార్తెను బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చేర్పించారు. సింధూజ తాను హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టంలేదని చెప్పడంతో తల్లిదండ్రులు మంగళవారం హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు. కుమార్తెకు సర్ది చెప్పి బుధవారం మళ్లీ కళాశాలలో వదిలివెళ్లారు. ఈ క్రమంలో తోటి విద్యార్థినులంతా భోజనం చేసేందుకు వెళ్లగా సింధూజ తన గదిలోకి వెళ్లి లోపల గడేసుకుని సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థినులు గది తలుపులు తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. దీంతో వారు కళాశాల సిబ్బందికి తెలియచేశారు. వారు బలవంతంగా తలుపులు తెరచి చూడగా అప్పటికే సింధూజ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుంది. కిందకు దించి చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని ఓ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళాశాల సిబ్బంది జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేయడంతో వారు హుటాహుటిన హస్పిటల్‌కు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తండ్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ముత్యాలయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఆయన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి ఆనం ఆదేశాలు.. రంగంలోకి దిగిన అధికారులు



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన తీరుతెన్నులను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

ఆత్మకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజు ఆదేశిస్తేగాని తత్వం బోధపడదు.. అనే చందంగా వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని సంబంధిత అధికారులు.. మంత్రి ఆనం ఆదేశాలతో రంగంలోకి దిగారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్ 67 రహదారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేషనల్ హైవే అథారిటీ అధికారులకు తాఖీదు జారీ చేయడంతో అధికారుల్లో చలనం వచ్చింది. బుధవారం ఆయా శాఖల అధికారులు పట్టణ సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల విభాగం జిల్లా పీడీ వీకే చౌదరి మాట్లాడుతూ వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాల తీరు తెన్నులను పరిశీలిస్తే అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడం తదితర కారణాలు కనిపిస్తున్నాయన్నారు. వేగనియంత్రణ, తదితర అవసరమైన భద్రతా చర్యలు వెంటనే చేపట్టి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, డీటీసీ చందర్, ఆర్‌అండ్‌బీ ఎస్సీ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, ఏఈ అమానుల్లా, ఎస్‌ఐలు షేక్ జిలాని, బీ. సాయిప్రసాద్, ఎంవీఐ ఎం రాములు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



వింజమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నేతాజీ వికాస్ స్కూల్ నుంచి బంగ్లా సెంటర్‌కు వెళ్లే మార్గంలో కాలువ నుంచి మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చి చేరుతోంది. దీంతో స్కూలుకు వెళ్లే విద్యార్థులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డు వెంబడి ఉన్న కాలువలో పూడికను తీయకపోవడంతో మురుగు రోడ్డు మీదకు వస్తుందని, దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ కాలువలోని పూడిక తీసి మురు గు రోడ్డు మీదకు రాకుండా చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

50శాతం రాయితీపై విత్తనాల పంపిణీ

ఏఎస్‌పేట, జూన్18 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 10కేజీల ప్యాకెట్ మార్కెట్ ధర రూ.1230లు అయితే 50శాతం సబ్సిడీతో రూ.615లకు అందిస్తామని, జనుము విత్తనాలు 10కేజీలు మార్కెట్ ధర రూ.1090 అయితే 50శాతం సబ్సిడీ తో రూ.545లకు, పిల్లి పెసర 8కేజీల ప్యాకెట్ మార్కెట్ ధర రూ.1440 అయితే 50శాతం సబ్సిడీతో రూ.720లకు అందిస్తామని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం తీసుకొని తమ వివరాలు నమోదు చేసుకుని నగదు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

● సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సంగం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడకారు వరిసాగుకు ఇప్పటి వరకు 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. బుధవారం మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఎడకారులో సుమారు 3 లక్షల ఎకరాలల్లో వరిసాగు చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఈ నెలలో సరఫరా చేశామన్నారు. గోదాముల్లో 1690 మెట్రిక్ టన్నుల యూరియా, 350 మెట్రిక్ టన్నుల డీఏపీ ఉందన్నారు. మంచి దిగుబడులు రావాలంటే రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అదే విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పటికే 3.99 లక్షల రికార్డులు ఫ్యూరిఫికేషన్ చేయడం జరిగింది. రైతులందరూ సచివాలయాల్లో ఈవేవైసీ చేయించుకోవాలని లేకపోతే అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులవుతారని ఆమె తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ ఏడీఏ నర్సోజి, అనిత రైతుల వరి పంట సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, మందుల పిచికారి, కలుపు నివారణ తదితర అంశములపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్, సర్పంచ్ షేక్ నాజున్ని, నీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

చేజర్ల: రైతులు ప్రభుత్వం అందించే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పీ హిమబిందు తెలిపారు. బుధవారం మండలంలోని తూర్పుపల్లి, మాముడూరు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చి రొట్ట ఎరువులు వాటి ప్రాముఖ్యత, వరిలో మొలకల శాతం నిర్ధారించుట, విత్తన శుద్ధి, నారుమడిలో యాజమాన్యం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పొందాలంటే రైతులు తప్పని సరిగ్గా ఈ పంటను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సుజాత, సుబ్బారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పబ్బులేటిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

సీతారామపురం: మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సాగులో ఉన్న జామ పంటను పరిశీలించి పేనుబంక ఉన్నట్లు గుర్తించారు. యూరియా, భాస్వరం , పొటాష్ ఎరువును మొక్క మొదళ్లకు కొంచెం దూరంలో వేయాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు, జనుములు, జీలుగలు సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నుట వలన భూమికి కావల్సిన సేంద్రీయ పదార్థం అందుతుందని, మిత్రపురుగులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సుధీర్ కుమార్, వీఏఏలక్ష్మీనారాయణ, కవిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు



జామ పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

వెంగమాంబ భక్తుల ఆకలి తీర్చిన ముస్లిం యువత



దుత్తలూరులో భక్తులకు అన్నం వడ్డిస్తున్న ముస్లిం యువత

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 18: మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంగ మాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు బుధవారం దుత్తలూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ముస్లిం యువత చందాలు వేసుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి ముస్లిం యువత చందాలు వేసుకుని అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడంపై పలువురు అభినందించారు. అలాగే నర్రవాడ గ్రామంలో పలువురు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించి భక్తుల ఆకలి తీర్చారు.

జోరుగా తలుపూరుపాడు చెరువు అభివృద్ధి పనులు



చెరువు కట్ట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏఈ వినయ్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు బాబు

సంగం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడు చెరువు కట్ట అభివృద్ధి పనులు జోరుగా ఊపందుకున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో చెరువులను పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో కట్టపై ముళ్ల కంపలు మొలవడంతో రైతులు పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చెరువు అభివృద్ధి పనులకు సుమారు రూ.7 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇటీవల చెరువు కట్టపై ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. అనంతరం గ్రావెల్‌తో చెరువు కట్టను పటిష్టం చేస్తున్నారు. ఈ పనులను బుధవారం ఇరిగేషన్ సంగం సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ పనుల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్మినెంట్ రూములల్లా బ్రాందీ షాపులు

వింజమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బ్రాందీ షాపులు పర్మినెంట్ రూముల్లా తయారయ్యాయి. బ్రాందీ షాపుల్లోనే మందుబాబులు తాగడం, దీనికితోడు గొడవలకు దిగడం వలన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అలాగే తాగి బైక్‌లపై వెళ్తూ పలు ప్రమాదాలకు గురవుతున్నారు. పల్లెల్లో అయితే బెల్ట్ షాపుల వలన కుటుంబ కలహాలు ఏర్పడి నిత్యం గొడవలు పడుతున్నారు. అలాగే అసాంఘీక కార్యక్రమాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని, గ్రామాల్లో బెల్ట్ షాపు యజమానులు అధిక రేట్లకు అమ్ముతూ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేసుకుంటూ సాగిస్తున్నారన్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి నెలనెల మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం వలన నిత్యం గొడవలు, ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలతో పట్టణంలో పరిస్థితి అదుపుతప్పుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మందు తాగుతున్న మందుబాబులు

ప్రజల సమస్యలు

సత్వరం పరిష్కరించాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్‌ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో మండల అధికారుల పనితీరు చాలా వెనుకబడి ఉందన్నారు. వీఆర్‌ఓలు, తహసీల్దార్ భూసమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం రికార్డులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా గయాళు, గ్రామ కంఠం భూములపై అర్జీలు వచ్చినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారం కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అధికారులు తప్పని సరిగా సమస్యలపై అవగాహన పెంచుకొని అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా యర్రారెడ్డిపాలెం, పెంట్రాల గ్రామాలలోని పంచాయతీ గ్రేజింగ్ భూములలో ఇంటి స్థలాలు ఇప్పించాలని ఆయా గ్రామస్థులు కోరారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎస్‌ఐ ఎం నారాయణ, ఆర్‌ఐ ఎం రమణయ్య, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238
కోడిగుడ్ల ధర (100):	515

నిరుపేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వెళ్లేందుకు బస్‌సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్న 17మంది నిరుపేద విద్యార్థినులకు వరల్డ్‌విజన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక డివిజన్ విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ నరసింహారావు, ఎంఈఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె అనూషల చేతుల మీదుగా వీటిని పంపిణీచేశారు. కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సంస్థ మేనేజరు యేసయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో

సెంట్రల్ డివైడర్‌లో మొక్కలకు రక్షణేదీ..?

● విరిగి మొక్కలపై పడిపోతున్న సేఫ్టీ గ్రిల్స్ ● పట్టించుకోని అధికారులు

కావలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డు సెంట్రల్ డివైడర్‌లో పచ్చదనం, పర్యావరణం కోసం పెంచుతున్న మొక్కలకు రక్షణ కరువవుతోంది. డివైడర్‌లో కొంతభాగం ఎత్తు తక్కువగా ఉన్న ప్రాంతంలో డివైడర్‌కు రెండు వైపులా మొక్కల రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే మొక్కలకు నీరు పట్టినపుడు అవి తడిచి తుప్పు పట్టి విరిగి పడిపోతున్నాయి. అయితే విరిగిపోతున్న గ్రిల్స్‌కు వెల్డింగ్ చేసి సరిచేయకపోవడంతో అవి మొక్కల మీద పడి మొక్కలు పాడైపోతున్నాయి. గ్రిల్స్ విరిగిన చోట మొక్కలకు పశువుల నుంచి రక్షణ కరువైంది. ఒక పక్క గ్రిల్స్ విరిగి పాడై పోవటమే కాక వాటిని దొంగలు తరలించుకుని పోతుండటంతో మున్సిపల్ ఆస్తులకు రక్షణ కరువవుతోంది. మరో పక్క మొక్కల ఆలనా పాలనా కరువై అవి పూర్తిగా ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. పచ్చదనం కోసం ఏర్పాటుచేసిన సెంట్రల్ డివైడర్ ఫ్లెక్సీలు కట్టుకోవటానికే పరిమితమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సెంట్రల్ డివైడర్‌లో విరిగిపోయిన గ్రిల్స్‌ను పునరుద్ధరించి మొక్కలకు రక్షణగా ఉంచి డివైడర్‌పై మొక్కలను రక్షించి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రంకు రోడ్డు సెంట్రల్ డివైడర్‌లో మొక్కలపై పడిఉన్న సేఫ్టీ గ్రిల్స్

న్యూస్ బాక్స్

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవు


ఉపాధి పనుల్లో శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఆ పథకం ఏపీఓ దయాసాగర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని పెద పవని గ్రామంలో జరుగుతున్న చెరువు, కాలువల పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శ్రామికుల మస్టర్లను తనిఖీ చేశారు. ఒకరి బదులు మరొకరు పనులకు రావద్దని చెప్పారు. అలాగే ఉదయం 6 గంటలకు పనులకు వచ్చి 10 గంటల వరకు పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన కూలీ డబ్బులు వచ్చేలా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఏ మహేంద్ర, ఎఫ్ఏ డి మధు ఉన్నారు.

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారు శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

బిట్రగుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారుగా సానా శ్రీనివాసులురెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దారుగా పనిచేస్తున్న సురేష్‌బాబు కొండాపురానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఆర్ఐ రామ్ కుమారి, వీఆర్వోలు, మండల సర్వేయరు వెంకటేశ్వర్లు, జూనియర్ సర్వేయర్లు తహసీల్దారుకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

పందుల స్వైర విహారం

● బెంబేలెత్తుతున్న ప్రజలు


అల్లూరులో సంచరిస్తున్న పందులు

అల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పందుల స్వైర విహారంతో అల్లూరు వాసులు బెంబేలెత్తిపోతున్నారు. వందల సంఖ్యల్లో పందులు సంచరిస్తున్నాయి. ఎప్పుడు ఎవరిమీద దాడులు చేస్తాయోనని భయబ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో చిన్నారులకు వీటివల్ల ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఎవరు జవాబుదారీ అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉండాల్సిన పందులు గ్రామంలోనే విచ్చలవిడిగా తిరుగుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి యజమానులు మాత్రం తమకేమీ పట్టనట్టు దూరంగా ఉండి చూసుకొని వెళ్తా ఉంటారు. ఇప్పటికైనా పందులను గ్రామానికి దూరంగా ఉండేలా కఠిన చర్యలు తీసుకొని ప్రమాదాలు సంభవించకుండా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

నర్రవాడకు ఉచిత బస్సు సౌకర్యం



బస్సులను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఉమాశంకర్

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నర్రవాడకు తమ బస్సుల ద్వారా భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు హరి కృష్ణ ట్రావెల్స్ అధినేత పాపన హరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారి పాలెం గ్రామానికి చెందిన హరికృష్ణ స్థానికుడవడంతో ఈప్రాంత వాసులకు కావలి నుంచి నాలుగు, అదేవిధంగా గుంటూరు జిల్లా మాచర్ల నుంచి మరో నాలుగు బస్సులను ఉచితంగా వెంగమాంబ దేవస్థానం వరకు భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఎస్ఐ ఉమాశంకర్ బస్సులను ప్రారంభించారు. భక్తులు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇంటర్ ఆన్సర్ షీట్స్ ట్యాంపరింగ్ వ్యవహారంపై

విజిలెన్స్ విచారణ జరపాలి

● శ్రీ గాయత్రీ కళాశాల యాజమాన్యం డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీగాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్, డైరెక్టర్

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో ఆన్సర్ షీట్స్ ట్యాంపరింగ్ వ్యవహా రంపై విజిలెన్స్ విచారణ జరపాలని శ్రీగాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కళాశాలలోని మెరిట్ విద్యార్థులను దెబ్బతీసేందుకు శ్రీ వివేకా జూనియర్ కళాశాల యాజమాన్యం కుటిల యత్నాలు చేసిందని విచారణలో నిగ్గుతేలినప్పటికీ ఇంటర్ బోర్డు అధికారులు నామమాత్రపు చర్యలతో సమస్యను రూపుమాపే ప్రయత్నం చేస్తున్నదని వారు ఆందోళన వ్యక్తంచేశారు. బోర్డు ఉన్నతాధికారులు జరిపిన విచారణలో నివ్వెరపోయే నిజాలు వెలుగుచూశాయని, బోర్డు అనుమతిలేని ఓ షెడ్డులో బాధిత విద్యార్థులు పరీక్షలు రాసిన వైనం బయటపడిందని తెలిపారు. ట్యాంపరింగ్ వ్యవహారానికి కీలకంగా ఎగ్జామినేషన్ సెంటర్‌లో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు విధినిర్వహణ చేయాల్సి ఉండగా కాలేజీ యాజమాన్యం దుర్బుద్ధితో ఏమాత్రం అర్హతలేని షాహుల్‌హమీద్ అనే ప్రైవేటు వ్యక్తిని ఆస్థానంలో నియమించి ట్యాంపరింగ్ వ్యవహారానికి తెరలేపిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్రీవివేకా కళాశాలపై క్రిమినల్ కేసు నమోదుచేయటంతో పాటు మొత్తం వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును కూల్చివేయండి

● మున్సిపల్ కమిషనర్‌కు గ్రామస్థుల మొర


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న చౌదరిపాలెం వాసులు

కావలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలో ఉన్న చౌదరిపాలెం గ్రామంలోని వాటర్ ట్యాంకుతో ప్రమాదం పొంచి ఉందని వెంటనే దానిని కూల్చివేయాలని ఆ గ్రామస్థులు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. సుమారు 50 సంవత్సరాల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థలో ఉందని, పశువులు వెళ్లి వాటర్ ట్యాంకు పిల్లర్లను రుద్దినా అది పడిపోయే పరిస్థితిలో ఉందని, అధికారులు ముందుగానే దానిని కూల్చి వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరారు.

వేతనానికి తగ్గట్లుగా పనిచేయాలి - ఏపీఓ



కళవళ్లలో ఉపాధి హామీ పనుల వద్ద మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేతనానికి తగినట్లుగా పనిచేయించాలని ఏపిఓ దయాసాగర్ తెలిపారు. మండలంలోని కళవళ్లలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాలను శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించాలి : సబ్ కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో మండల అధికారుల పనితీరు చాలా వెనుకబడి ఉందన్నారు. వీఆర్ఓలు, తహసీల్దార్ భూసమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం రికార్డులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా గయాళు, గ్రామ కంఠం భూములపై అర్జీలు వచ్చినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారం కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అధికారులు తప్పని సరిగా సమస్యలపై అవగాహన పెంచుకొని అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈసందర్భంగా యర్రారెడ్డిపాలెం, పెంట్రాల గ్రామాలలోని పంచాయతీ గ్రేజింగ్ భూములలో ఇంటి స్థలాలు ఇప్పించాలని ఆయా గ్రామస్థులు కోరారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతా మహాలక్ష్మి, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎస్ఐ ఎం నారాయణ, ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలి

● సీఐటీయూ ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయు జిల్లా నాయకుడు పై కృష్ణమోహన్ కోరారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాల్లో కోత పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి వీరి పిల్లలకు తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాల్లో కోత పెట్టడం అన్యాయమన్నారు. రూ. 25వేల లోపు జీతాలున్న కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాల్లో కోత పెట్టడం అన్యాయమని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించి చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బాబు, శీనయ్య, పోలయ్య, బీ మహేష్, పల్లెపాటి అనిత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● హౌసింగ్ డిప్యూటీ ఈఈ


కాకర్లవారిపాలెంలో ఎస్టీల గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డిప్యూటీ ఈఈ

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న రూ. 70 వేలతో గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని హౌసింగ్ డిప్యూటీ ఈఈ పి.వి నారాయణ తెలిపారు. మండలంలోని కాకర్లవారిపాలెంలోని ఎస్టీ గృహనిర్మాణాలను బుధవారం హౌసింగ్ డిప్యూటీ ఈఈ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న రూ 70 వేలలో ఇప్పటికే రూ 22500 చెల్లించినట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎస్టీలకు రూ. 70 వేలు, ఎస్సీ, బీసీలకు రూ 50 వేలు అదనంగా చెల్లిస్తునట్లు తెలిపారు. ఎస్టీ, ఎస్సీ బీసీల గృహ నిర్మాణ లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణ పనులను త్వరితగతిన నిర్మించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, హౌసింగ్ ఏఈ నాగరాజు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రైతులకు 80 శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్లు



కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్నఏవో

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు 80శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అబ్దుల్‌రహీం కోరారు. మండలంలోని ఓగూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డుతూ ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి 80శాతం రాయితీపై డ్రోన్ పొంద వచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ పి అనసూయ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఈకేవైసీ ఎక్కడైనా చేయించుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై పొంద దలచుకున్న రైతులు సమీప రైతుసేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శరత్, గ్రామనాయకులు అల్లం రాధయ్య, పచ్చవ తిరుపతిస్వామి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వలేటివారిపాలెం: పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి అని ఏఓ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేని పాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఏఓ శేషారెడ్డి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి వలన పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సురేష్, నాగరాజు, రవీంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియలో జాప్యంతో ప్రభుత్వ కాలేజీలకు నష్టం



● డాక్టరు ఎం. రవికుమార్, ప్రిన్సిపాల్, టీఆర్ఆర్ కళాశాల

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు నష్టం జరుగుతోందని, విద్యార్థినీ, విద్యార్థులు ముందు ప్రారంభమవుతున్న ప్రైవేటు కాలేజీల్లో చేరిపోతున్నారని కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ ఏడాది కళాశాలలో కొత్తకోర్సు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్వ్యూ

? టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది

! అడ్మిషన్ల ప్రక్రియపై ఇంకా స్పష్టత రాలేదు. జూలై 15నుంచి ప్రారంభిస్తామని ఉన్నతాధికారులు మౌఖికంగా తెలిపారు తప్ప ఇప్పటివరకు స్పష్టత లేదు.

? ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి కదా.

! తరగతులు కూడా ప్రారంభించారు.

? మొత్తం ఎన్నిసీట్లు ఉన్నాయి

! ఈ ఏడాది 367 సీట్లు ప్రపోజ్ చేశాం. ఉపాధి కల్పన గ్యారంటీతో ఈ ఏడాది కొత్త కోర్సును కళాశాలలో ప్రారంభిస్తున్నాం. సెక్టార్‌స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా బ్యాంకింగ్ ఫైనాన్స్ సెక్టార్ అండ్ ఇన్సూరెన్స్ కోర్సు

వ్యభిచార గృహంపై దాడి

● నలుగురి అరెస్టు

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్ధనకాలనీ వాటర్‌ట్యాంకు సమీపంలోని ఓ నివాసంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ శివ నాగరాజు తెలిపారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, ఒక విటుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

సర్వీసు రోడ్లు లేక వాహనదారుల అవస్థలు


కావలి-దుత్తలూరు మార్గంలో గ్రామాలవద్ద ఏర్పాటు చేసినడ్రమ్ములు

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి దుత్తలూరు మీదుగా సీతా రామపురం జాతీయ రహదారి పనులు పూర్తి కావస్తున్నా సర్వీసు రోడ్ల నిర్మాణం లేకపోవడం ఈమార్గంలో ప్రయాణం చేసే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ళ క్రితం ప్రారంభమైన 167బీజీ జాతీయ రహదారి పనులు ప్రస్తుతం ఒక రూపు దాల్చాయి. జలదంకి, కలిగిరి పట్టణాల వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి పనులు జరుగుతున్నాయి. రహదారి పనులు నిర్మాణం పూర్తి కావస్తున్నా గ్రామాల సమీపంలో సర్వీసు రోడ్ల నిర్మాణాలను మొదలు పెట్టకపోవడంతో వాహన దారులతోపాటు, ఆయా గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ మైలు, అయ్యపరెడ్డిపాలెం, పెదకొం డూరు, పోలంపాడు, నాగిరెడ్డిపాలెం సెంటర్ తదితర గ్రామాల వద్ద రోడ్లపైనే ఇళ్ళు, దుకాణాలు ఉండటంతో స్థానికులు నిత్యం వివిధ పనులపై రహదారి దాటవలసి వస్తుంది. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గాలలో వెళ్ళే వాహనాలు వేగంగా వెళ్ళే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముంది. హెచ్చరికలు, సూచికల బోర్డులు ఏర్పాటు చేయకుండా డ్రమ్ములకు తెలుపురంగు పెయింట్, రెడ్‌స్టిక్కర్లు అతికించి గ్రామాల వద్ద రహదారులపై ఏర్పాటు చేశారు. తాత్కాలిక పద్ధతులతో ప్రమాదాలను నివారించలేమని, గ్రామాల సమీపంలో సర్వీసురోడ్లు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

కమనీయం.. వెంగమాంబ కల్యాణం

(5వ పేజీ తరువాయి)

వీధుల గుండా సాగింది. భజనలు, బైనడీల నృత్యాలతో అంగరంగ వైభవంగా ప్రదానోత్సవం చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● పోటెత్తిన జనం

బుధవారం జరిగిన వెంగమాంబ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.అగ్నిగుండంలో కొబ్బరి వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు కానుకలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకొన్నారు.

● నేడు పొంగళ్లు

వెంగమాంబ తిరునాళ్ల చివరి రోజైన గురువారం ఉదయం పొంగళ్లు, బండ్ల తిరుగుట, సాయంత్రం బండలాగుడు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


వడ్డిపాళెం నుంచి ఊరేగింపుగా పసుపు, కుంకుమ తీసుకొస్తున్న భక్తులు

పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఎంతోటి చెన్నకేశవులు

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చేసింది. తొలకరి వర్షాలు సమయంలో జీవాలకు వ్యాధులు సోకే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహయ సంచాలకులు ఎంతోటి చెన్న కేశవులు పశుపోషకులకు సూచించారు. వర్షాకాలంలో పశువులపై వ్యాధులు దాడి చేస్తాయంటున్నారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి పశువులను, జీవాలను కాపాడుకోవచ్చునని అన్నారు. రోగాలు వచ్చినట్లు గుర్తించగానే సంచార పశువైద్యశాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు సమచారం అందించాలని చెప్తున్నారు. వలేటివారి పాలెం మండలంలోని 15 రైతు బరోసా కేంద్రాల పరిధిలో 460 ఆవులు, ఎద్దులు, 14692 గేదెలు, 7063 మేకలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


వర్షాకాలంలో వచ్చే వ్యాధులు ఇవే..

వర్షాకాలంలో గుదిపెట్టు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీంతో గొర్రెలు, మేకలు జ్వరం నీరసంలో మేత మేయవు. గొర్రెలు అప్పటికప్పుడే చనిపోతాయి. తొలకరి వర్షాలకు 10 నుంచి 15 రోజులు ముందుగానే వ్యాక్సిన్ వేయించాలి.

పశవులకు గొంత వాపు వ్యాధితో ముప్పు ఉంటుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడతాయి. గొంతు కిందకు నీరు దిగి గొంత వాపు వస్తుంది. జూన్, జూలై నెలలో (హెచ్ఎస్) టీకా వేయించుకోవాలి.

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ అధికారుల విచారణ

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023వ సంవత్సరంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై నెల్లూరు విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. ఈమేరకు బుధవారం నెల్లూరు విజిలెన్స్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో అధికారుల బృందం లింగ సముద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులను విచారించారు. ఆ ఏడాదిలో ఏయే పంచాయతీలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు, ఎంతమంది క్రీడాకారులు పోటీలలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు, ఎంతమంది క్రీడాకారులు పాల్గొన్నారు, పంచాయతీలలో ఏయే చోట్ల పోటీలు నిర్వహించారు, పంచాయతీల నుంచి మండల స్థాయి పోటీలకు ఎంతమంది వెళ్లారు, ఈ పోటీలకు వచ్చిన క్రీడా పరికరాలు తదితర వివరాలను ఆయా పంచాయతీ కార్యదర్శులను అడిగి రాతపూర్వకంగా తీసుకున్నారు. అలాగే ఈ పోటీలకు ఎంత మొత్తం నిధులు మంజూ రయ్యాయి, ఏమేరకు ఖర్చయ్యాయి, వాటి రశీదులు తదితర వివరాల గురించి ఆరా తీసి వాటిని వారి నుంచి తీసుకున్నారు. అలాగే కొందరి నుంచి బ్యాంకు స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన వారు ఒకటి రెండు రోజుల్లో పంపనున్నట్టు సమాచారం.





ముక్కంటి క్షేత్రంలో యోగా





యోగాంధ్రలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తిలోని రాజగోపురం వద్ద యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. యోగాంధ్రలో భాగంగా జిల్లాలో 9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. యోగా.. మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రతను పెంచడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు. జీవితంలో మార్పు.. ఆరోగ్యం కోసం రోజూ యోగాకు అరగంట కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్దనరెడ్డి, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఇతర అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని మేధో గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తమ పిల్లలను ఆలయానికి తీసుకువచ్చి అక్షరాలు దిద్దించారు. ఎమ్మెల్యే సుధీర్ చిన్నారులకు పలక, బలపాలు అందజేసి వారి చేత అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

మామిడి రైతుకు మద్దతేదీ?

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు కొంటే చర్యలు తీసుకుంటాం.

ఇదీ కలెక్టర్ వెంకటేశ్వర్ చేస్తున్న హెచ్చరికలు. అయినా, మామిడి రైతులకు వ్యాపారుల నుంచి మద్దతు రావడం లేదు.

\- పాకాల, ఆంధ్రజ్యోతి

- తోతాపురి కొనింది రూ.3 వేలకే.. సాయంత్రం మరింత తగ్గింపు
- రోడ్డు పక్కన పారబోసిన రైతులు

మామిడికి మద్దతు ధరపై ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల ఆదేశాలను గుజ్జు పరిశ్రమలు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు పట్టించుకోవడం లేదు. వీరంతా సిండికేటుగా మారి బుధవారం ర్యాంపుల వద్ద కొనుగోళ్లను ఆపేశారు. దీంతో రైతులు పడిగాపులు గాస్తున్నారు. తోతాపురి టన్ను మద్దతు ధర రూ.8వేలు కాగా.. కనీసం రూ. 6వేలకైనా కొనాలని రైతులు ప్రాధేయపడుతున్నా వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. చివరకు బుధవారం రూ.3వేలకు ధర పడిపోయింది. చీకటి పడ్డాక కొందరు రూ.1500కే కొనుగోలు చేశారు. మామిడి కోత కూలీ, రవాణాకుగాను టన్నుకు రూ.2500 ఖర్చవుతోందని రైతులు అంటున్నారు. చివరకు ఈ కూలి ఖర్చులూ రాక చేతినుంచి పడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టన్ను రూ.2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో కొందరు కడుపుమండి ట్రాక్టర్లలో తెచ్చిన మామిడి కాయలను రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోతున్నారు. ఇక, మరోవైపు గుజ్జు పరిశ్రమలకు ట్రాక్టర్లలో తీసుకెళ్తే అన్‌లోడింగ్‌కు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీంతో ట్రాక్టర్లు దొరకడంకూడా కష్టమవుతోంది. దామలచెరువు పరిసరాల్లోని ర్యాంపుల యజమానులు ఒక్కటై ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఉద్యాన శాఖ అధికారులు, మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులతో, గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంప్ నిర్వాహకులతో చర్చించినా ఫలితం కనిపించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలన్నీ పక్వానికి వచ్చి రాలిపోతున్నాయని, త్వరతగతిన కొనుగోళ్లు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాగా, ఎస్పీ హర్షవర్ధనరాజు బుధవారం దామలచెరువులోని మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులు, సప్లయర్లతో మాట్లాడారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, మండల ఉద్యాన అధికారి శైలజ బుధవారం మ్యాంగోనగర్‌లో పర్యటించారు. గుజ్జుపరిశ్రమల యజమానులు, ర్యాంప్‌లవద్ద సప్లయర్లు, మండీ వ్యాపారులు తోతాపురి మామిడికాయలు కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు. ర్యాంప్‌ల వద్ద టోకెన్లు ఇచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా మద్దతు ధరకు కొనాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.

'మద్దతు' లేకుంటే కఠిన చర్యలు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడిపై మద్దతు ధరకన్నా తక్కువ చెల్లించేవారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం గుజ్జు పరిశ్రమ యాజమాన్యం, అధికారులతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. 'దామలచెరువులోని ట్రేడర్లు రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. మద్దతు ధరకంటే తక్కువ ఇస్తే చర్యలు తీసుకుంటాం. గుజ్జు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో మామిడి పంట ఉత్పత్తికన్నా ఎక్కువగా ఉన్న కారణంగా ప్యాకింగ్ మెటీరియల్‌ను సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్ల కెపాసిటీని పెంచుకోవాలి. రైతులకు రావాల్సిన డబ్బును త్వరలో అందించాలి. ధరల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలి. మండలాల్లో తహసీల్దార్లు, ఉద్యాన అధికారులు మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.



రోడ్డు పక్కన రైతులు పడేసిన తోతాపురి కాయలు

బారులు తీరిన ట్రాక్టర్లు

ఎర్రావారిపాలెం,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెంలోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం మామిడి కాయలతో ట్రాక్టర్లు బారులు తీరా యి. గతేడాది పల్ప్ ఇప్పటికీ అమ్ముడుపోలేదంటూ ఈసారి పెద్దగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు డీలా పడుతున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో పంటలో 10 శాతం కన్నా తక్కువే ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. ప్రోత్సాహకం ప్రకటించినా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



35 గంటల వెయిటింగ్

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకెళ్లే గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆ వివరాలను చూస్తే.. నవ క్వాలిటీ ఫుడ్స్(ఎర్రావారిపాలెం)లో గరిష్ఠంగా 35గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. రాసా ఫుడ్స్ (బీఎన్‌కండ్రిగ) గంట.. లియాన్ ఫుడ్స్(పుత్తూరు) 12గంటలు.. టాసా ఫుడ్స్ (నారాయణవనం) 24గంటలు.. శ్రీవర్ష ఫుడ్స్ (రేణిగుంట) 12గంటలు.. శ్రీదేవరాజుఆగ్రో ఫుడ్స్(కేవీబీపురం) 12గంటలు.. క్యాపికాన్(సత్యవేడు) 5గంటలు,, సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ (పాకాల) 20 గంటలు వాహనాలు వేచి ఉండే పరిస్థితి ఉందని జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. టోకెన్ సిస్టమ్ పాటిస్తే ఈ పరిస్థితి తప్పుతుందన్నారు.

● తమిళనాడులోని దోపిడీ కేసులో..

ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరెస్ట్



అరుణ్‌కుమార్

తిరుమల/చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపత్తూరు జిల్లా వాణియంబాడిలోని తోళ్లపరిశ్రమ యజమాని ఇంతియాస్ అహ్మద్ ఇంట్లో శక్తివేల్ పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట దుండగులు ఆయన భార్య సబితా గుల్నంను కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు శక్తివేల్‌ను అనుమానించారు. ఇతడికి పరిచయమున్న కొల్లకట్టి ప్రాంతవాసి ఇళవరసన్, తిరుపతికి చెందిన శాంతకుమారి దోపిడీకి పాల్పడగా.. తిరుమలలో పనిచేసే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్ ప్లాన్ ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. తిరుపతి పోలీసుల సహకారంతో అరుణ్‌కుమార్‌ను వాణియంబాడికి తీసుకెళ్లారు. కడపజిల్లాకు చెందిన అరుణ్‌కుమార్ రెండేళ్లుగా అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తిరుమలలో బ్యాగేజీ స్కానింగ్ సెంటర్‌కు మారాడు.

'చాళుక్య' సేల్‌పై కమిటీ

- ఎమ్మెల్యే కమిటీ ప్రతిపాదనకు కౌన్సిల్ ఓకే
- వైసీపీ, కూటమి కార్పొరేటర్ల మధ్య వాడి వేడి చర్చ






మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - సభ్యుల మధ్య వాదోపవాదాలు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన చాళుక్య హోటల్ స్థల విక్రయంపై కమిటీ వేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 84 అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నిధులకోసం ప్రత్యామ్నాయ మార్గాలవైపు కార్పొరేషన్ అన్వేషించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కోరారు. సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు అందరి సహకారంతో ముందుకు వెళతామని కమిషనర్ మౌర్య అన్నారు. సదరు స్థలాన్ని టీటీడీకి అప్పగించి సీవోసీ నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఎస్కే బాబు సూచించారు. తూకివాకం వద్దగల కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించే ఆలోచన చేయాలని మరో కార్పొరేటర్ నరసింహాచారి సూచించారు. చాళుక్య స్థలం విక్రయంపై వాడి, వేడిగా చర్చ సాగింది. కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జోక్యం చేసుకుని కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. నిధులు లేకుండా నిలిచిపోయిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని పూర్తి చేసేందుకు నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని విక్రయించడమో, పీపీపీ ద్వారా కేటాయించడమో చేయాలని ప్రభుత్వం భావించిందన్నారు. దీనిపై కొందరు కుట్రపూరితంగా ప్రభుత్వంపై అసత్య ప్రచారానికి పూనుకున్నారని చెప్పారు. స్థల విక్రయానికి సంబంధించి రెండు వారాల్లో ఒక కమిటీ ఏర్పాటుచేసి, తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రతిపాదించగా కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు.

అందుకే నేను వ్యతిరేకించలేదు



'అజెండాలో ఉన్న చాళుక్య హోటల్ విక్రయించే అంశం ముందుగానే నా దృష్టికి వచ్చింది. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని తెలిసింది. అందుకే నేను వ్యతిరేకించలేదు' అని మేయర్ శిరీష చెప్పారు. వ్యక్తిగతంగా స్థల విక్రయానికి తాను వ్యతిరేకినని చెప్పారు. డిప్యూటీ మేయర్లకు కారు అలవెన్సు అంశంపై వైసీపీ కార్పొరేటర్లు గణేష్, ఆరణి సంధ్య అభ్యంతరం చెబితే ఇలాంటి విషయాలపై చర్చపెట్టి ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తామని, గతంలో ఎలా ఉందో అలాగే కమిషనర్ నిర్ణయం తీసుకుంటారని మేయర్ హుందాగా వ్యవహరించారు.

ఇలాగే వదిలేస్తే అదికూడా మిగలదు



'కార్పొరేషన్‌కు తొలుత అధికారికంగా 92 సెంట్లు ఉండేది. ఈస్టు పోలీస్ స్టేషన్‌కు 15 సెంట్లు ఇచ్చారు. మిగిలింది 77 సెంట్లు ఉండాలి. కానీ పోలీస్ స్టేషన్ అధీనంలో మరో 15 సెంట్లు, ఫ్రీలెఫ్ట్ కోసం కొంత స్థలం, మరికొంత ఆక్రమణలు పోను, ఇప్పుడు సర్వే చేస్తే 39 సెంట్లు మాత్రమే ఉంది. ఇలాగే వదిలేస్తే 20 సెంట్లు కూడా మిగలదు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ భవనం 30 శాతమే నిర్మాణం జరిగింది. నేను వచ్చాక కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేసి 70 శాతం వరకు పూర్తి చేశాం. బకాయిలు ఇస్తేనే 6 నెలల్లో నిర్మాణం పూర్తిచేసుకోవచ్చు. అందుకే 30 ఏళ్లగా వృథాగా ఉన్న స్థలాన్ని పీపీపీ విధానంలో ఇవ్వాలా? విక్రయించాలా? అని కౌన్సిల్ అనుమతి కోసం తీసుకొచ్చాం' అని కమిషనరు మౌర్య అన్నారు.

దుష్ప్రచారం చేసినవారిపై కేసులు

అజెండాలో ప్రస్తావించని అంశాలను వైసీపీ నేతలు కాకిలెక్కలు వేసి అంకణం రూ.60వేలకు అమ్మేస్తున్నట్టు ప్రచారం చేయడం మంచిదికాదని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మండిపడ్డారు. ఇలా అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. కపిలతీర్థం సర్కిల్లో కారుచౌకగా కార్పొరేషన్ స్థలాన్ని కట్టబెట్టిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు.

మరో టూరిజం భవనంగా మార్చేస్తారా?

రుయాస్పత్రి ఎదురుగా నిధుల కొరతతో నిలిచిపోయిన టూరిజం భవనంలాగే మున్సిపల్ కార్యాలయాన్ని కూడా మార్చేస్తారా అంటూ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ప్రశ్నించారు. దీన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంకణం రూ.10లక్షలపైన వస్తే విక్రయించడం వల్ల ప్రజలకు అభ్యంతరం ఉండదన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్ విస్తరణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

- సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర భద్రత, భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా అలిపిరి చెక్‌పాయింట్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ఠ భద్రత తదితర అంశాలపై రాక్సా సంస్థ (జీఎంఆర్ గ్రూప్) పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. తనిఖీలు, లగేజీ స్కానింగ్‌కు సమయం, సమస్యలపై అధికారులతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరింత వేగంగా వాహనాలు, లగేజీ స్కానింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని రాక్సా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. చెక్‌పాయింట్ వద్ద తనిఖీ సమయాన్ని తగ్గించేందుకు మార్గాలను సూచించాలన్నారు. టీటీడీ విజిలెన్స్ విభాగం లగేజీ స్కానింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రెండు దశాబ్దాల్లో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భద్రతాంశాలపై ప్రతిపాదించాలని రాక్సా ప్రతినిధులను కోరారు. ఆధునిక స్కానర్ల ఏర్పాటు, స్కానర్ల సంఖ్య పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఎయిర్‌పోర్టు తరహాలో లగేజీ కన్వేయర్ బెల్ట్‌ల పొడవును పెంచి సమయాన్ని నివారించే అంశం పరిశీలించాలన్నారు. మరింత మంది భద్రతా సిబ్బందిని నియమించి తనిఖీలను సులభతరం చేయాలని సూచించారు. రాక్సా సీఈవో అమిత్ దార్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- సోమవారం హుండీ ఆదాయం: రూ.4.12 కోట్లు
- మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 81,037
- తలనీలాలు సమర్పించినవారు: 30,548

సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటోందని, సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను రాయితీతో అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం 1,678 మంది చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి రాయితీ సొమ్ము రూ2,67,26,984 మెగా చెక్కును వ్యవసాయ అధికారి ప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు సుమారు రూ.6కోట్ల విలువ గల వ్యవసాయ యంత్ర పరికరాలను అందించినట్లు తెలిపారు. అందులో రాయితీ కింద రూ.2,67,26,984 రైతులకు అందిస్తున్నామన్నారు. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయాలనే విషయం తెలుసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను పెంచాలని సూచించారు. రైతులు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

అన్నదాతకు వెన్నుదన్ను

- ఖరీఫ్‌కు ముందే.. గత నెలలో రాయితీతో పరికరాల పంపిణీ



సూళ్ళూరుపేటలో గతనెలలో రాయితీతో పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మొత్తం వ్యవసాయ పరికరాలు 1678. వీటి విలువ మొత్తం రూ.5.96 కోట్లు. అందులో రాయితీ మొత్తం 2,67,26,984 రూపాయలు. ఇలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో రైతులకు రాయితీతో యంత్రాలు అందించి వెన్నుదన్నుగా నిలిచింది. వ్యవసాయం పాతపద్ధతిలో చేస్తే లాభం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చేస్తేనే రైతు లాభాలబాట పడతాడు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పదేపదే చెబుతారు. ఆయన 2014-19లో కూడా ఈ దృష్టితోనే అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని తేలిగ్గా తీసుకుంది. గ్రూపులుగా ఏర్పడితేనే అందజేసేది. అదీ మొక్కుబడిగా ఇచ్చింది. గతేడాది కూటమి ప్రభుత్వం రావడంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యక్తిగతంగానూ యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. జిల్లాకు కేటాయించిన 1,678 పరికరాలను ఖరీఫ్‌కు ముందే గతనెల మొదటి వారంలోనే పంపిణీ చేసి అన్నదాతకు ఆసరాగా నిలిచింది. ఐదెకరాలలోపు ఉండి దరఖాస్తు చేసుకున్న సన్న, చిన్నకారు, మహిళా రైతులు 1,678 పరికరాలకు దరఖాస్తు చేసుకోగా.. అందరికీ పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. రాయితీపై 15 డ్రోన్లు అందించామన్నారు.

పంపిణీ చేసిన పరికరాలివీ

ట్రాక్టరుకు అనుసంధానించే యంత్రాలు	:899
పవర్ స్ప్రేయర్లు	:626
బ్యాటరీ స్ప్రేయర్లు	:66
రొటావేటర్లు	:57
పవర్ వీడర్లు	:16
బుష్ కట్టర్లు	:10
పవర్ టిల్లర్లు	:4

- క్లిష్ట నేరాలను గుర్తించడం.. అదుపు చేయడంలో

తిరుపతి పోలీసులు భేష్

- సీసీ కెమెరాలుంటే నేరస్థుల్లో భయం
- 123 సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి జనాభా దాదాపు 4.5 లక్షలు. రోజూ మరో 1.5 లక్షల మంది తిరుమలకు వచ్చి వెళుతుంటారు. ఇలాంటి చోట నేరాలు చేయడం చాలా సులభం. అదే సమయంలో నేరాల నియంత్రణ.. నేరాలు జరగకుండా చూడడం పోలీసులకు సవాల్ వంటిది. ఈ విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయం' అని కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీసు శాఖ, ఫ్రీడం ఆయిల్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి నగరం జీవకోనలో ఏర్పాటు చేసిన 123 సీసీ కెమెరాలను బుధవారం ఓ హోటల్‌లో కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నగరంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతంలో ఏక కాలంలో 123 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీంతో ఇక్కడ నేరాలు చేయాలన్నా ఒకటికి రెండు సార్లు ఆలోచించి భయపడే పరిస్థితిని పోలీసు శాఖ తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రియల్ టైం పోలీసు వ్యవస్థతో నేరాల దర్యాప్తుతో పాటు నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తితో డ్రోన్ల కొనుగోలు, సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు రూ.30 లక్షలు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. ఇంకా అవసరమైతే తామిద్దరం టీమ్ వర్క్ చేసి తిరుపతిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడం, ప్రజలకు అవసరమైన పోలీసు సేవలు అందించడంలో ముందుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా అంతటా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. 'జీవకోనలో 40 లోకేషన్లు, అన్ని దారులు, ప్రధాన కూడళ్లలో ఏమి జరిగినా క్షణాల్లో కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా తెలిసిపోతుంది. వాహనాల రాక పోకలు సాగించే సమయంలో వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు సీసీ కెమెరాల్లో నమోదవుతాయి. పోలీసు శాఖకు కలెక్టర్ అందిస్తున్న సహకారం మరవలేనిది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. నాలుగు నెలల్లోనే 123 సీసీ కెమెరాల ఏర్పాటుకు ఫ్రీడం ఆయిల్ జాతీయ స్థాయి సేల్స్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. తమ కంపెనీ సామాజిక దృక్పథంతో మహిళలకు భద్రత, భరోసా కల్పించే విషయంలో ముందుంటుందని చంద్రశేఖర రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అయ్యప్ప, అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం జీవకోనలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ పరిశీలించారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



దాత తరఫున అదనపు ఈవోకు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన అనిదృత్ అనే భక్తుడు ఈ విరాళాన్ని ఇచ్చారు. ఈమేరకు దాత తరఫున ఆయన ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్‌ను అందజేశారు.

తిరుపతి జిల్లాలో ముగ్గురిపై ఎలుగుబంట్ల దాడి

- ఒకరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకయ్య

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట సమీపంలోని వెలుగొండ అటవీ ప్రాంతంలో బుధవారం ముగ్గురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. పాలెంకోటకు చెందిన కటారి అంకయ్య, కావడి మునెయ్య, వెంకటగిరి చెందిన మరొకరు వెదురు కర్రల కోసం వెలుగొండ అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో రెండు ఎలుగుబంట్లు వీరిపై దాడి చేయడంతో కటారి అంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీళ్లతో పాటు వెళ్లిన కుక్క ఎలుగుబంట్లపై తిరగబడటంతో అవి వెళ్లిపోయాయి. వీరితో పాటు వెళ్లిన మరో వ్యక్తి ఎవరన్నది తెలియలేదు. కాగా, మునెయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

సినీ ఫక్కీలో కత్తిపోట్లు యువకుడి పరిస్థితి విషమం

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీహరిపై అదే ప్రాంతానికి చెందిన సూర్య సినీ ఫక్కీలో కత్తితో పొడిచి పరారైనట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. శ్రీహరి, సూర్య మధ్య పాత కక్షలున్నాయి. బుధవారం శ్రీహరి తన ఇంటి సమీపంలో వీధిలో నిలబడి ఉండగా స్కూటీపై వచ్చిన సూర్య కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సదరన్ డిస్కంలో 15 మందికి కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు ఇచ్చిన సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్),జూన్18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను బుధవారం సంస్థ సీఎండీ కె.సంతోషరావు పరిష్కరించారు. అర్హులైన 15 మందికి నియామక పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు గురుతర బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. సంస్థ ఆర్థికాభివృద్ధితో పాటు ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ జె.రమణాదేవి, జీఎం వై.వెంకటరాజు పాల్గొన్నారు.



యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్, ఇతర అధికారులు

21న తారకరామ స్టేడియంలో

10వేల మందితో యోగా

తిరుపతి(కలెక్టరేట్/క్రీడలు), జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న తిరుపతిలోని తారకరామ స్టేడియంలో 10వేల మందితో యోగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. యూనివర్శిటీలు, కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలని ఆయా శాఖల వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, బుధవారం సాయంత్రం కమిషనర్ మౌర్యతో కలసి జేసీ శుభం బన్సల్ తారకరామ మైదానంలో పర్యటించారు. ముందురోజే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రామ్మోహన్ రావు, పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్ పాల్గొన్నారు.

మామిడి పంట సేకరణపై రైతులకు సమాచారం ఇస్తున్నాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మామిడిపంట సేకరణకు సంబంధించిన సరైన సమయంలో రైతులకు సమాచారం అందజేస్తున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ వెంకటేశ్వర్ తీసుకెళ్లారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబునాయుడు పొగాకు, మామిడిపండ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోఈ-క్రాప్ డేటా మేరకు 20,500మంది మామిడిపంటలను సాగు చేసిన రైతులు ఉన్నారని అందులో ఏడాదికి 1.45 మెట్రిక్ టన్నులు కాయలు దిగుబడి అవుతోందన్నారు. జిల్లాలో 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని ప్రస్తుతం 15వేల టన్నులు సేకరించామని తెలిపారు. వారం క్రితం కంగారుపడి ముందస్తుగానే పంటను కోతలు కోసేవారిని అయితే అందరికి సబ్సిడీ వర్తిస్తుందని చెప్పడంతో పంట దిగుబడి వచ్చిన తరువాత తెస్తున్నారన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని ఇక్కడ అక్కడ అధికారులను పర్యవేక్షణకు నియమించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఎంత సరుకు నిల్వ ఉంది ఎంత సేకరిస్తున్నారనే విషయం చెబుతున్నామన్నారు. రైతు వద్ద చివరి మామిడికాయ వరకు సేకరిస్తామని కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తే నా లక్ష్యం

- విడుదలై వెళ్తున్న సురేష్‌బాబు



పెనుకొండ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : 17ఏళ్లకుపైగా జైలు జీవితాన్ని అనుభవించాను. ఇక నుంచి నా కుమారుడు, కుమార్తె భవిష్యత్తే నా లక్ష్యమని విడుదలపై వెళ్తున్న సురేష్‌బాబు అన్నారు. బుధవారం 14ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నవారిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17మంది అర్హులను విడుదల చేశారు. ఈ క్రమంలో పెనుకొండ సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న సురేష్‌బాబుకు విముక్తి కలిగింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ తాను తమిళనాడు చెన్నైలో ఉండేవాడినని వివాహ అనంతరం తిరుపతిలో ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగించేవాడినని కుటుంబ కలహాలతో భార్య మృతిచెందడం నాపై వరకట్నం కేసు నమోదుకావడం అప్పట్లో 3నెలలు తిరుపతి జైలులో రిమాండులో ఉన్నాను. అనంతరం కోర్టు విచారణ అనంతరం 2006లో 302-498ఏ సెక్షన్ల కింద శిక్ష ఖరారు చేశారు. అనంతరం కడప జైలులో 10ఏళ్లు, తరువాత సత్‌ప్రవర్తన కలిగి ఉండటంతో పెనుకొండ సబ్‌జైలుకు తరలించారు. అక్కడ ఏడున్నర సంవత్సరాలున్నాను. ప్రస్తుతం కుమారుడు, కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ఏదైనా పనిచేసుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాను. 17మంది విడుదలైన జాబితాలో నా పేరు ఖరారు చేయడం ఆనందంగా ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

జో.. లాలీ.. జో

- అమ్మ పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్నా



బిడ్డకోసం చెట్టుకు ఉయ్యాల కట్టి..



చిన్నారిని లాలిస్తున్న తండ్రి

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమ్మ.. పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్న అంటూ చిన్నారులను ఆడిస్తూ కుటుంబీకులు గడిపారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డీఎస్సీ పరీక్ష సందర్భంగా ఈ దృశ్యాలు కనిపించాయి. ఉదయం జరిగిన పరీక్షకు 100 మందికి గాను 93 మంది, మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 97 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రానికి నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అభ్యర్థులను కేటాయించారు. ఆయా జిల్లాల నుంచి సమయం దొరకదన్న అనుమానంతో ముందుగానే మహిళా అభ్యర్థులు తమ చంటిబిడ్డలను తీసుకుని వచ్చారు. తమ బిడ్డలకు కళాశాల ప్రాంగణంలోని చెట్లకు చీరలను ఉయ్యాలుగా కట్టి తమ తల్లులు, భర్తల పర్యవేక్షణలో ఆడించమని చెప్పి పరీక్షలకు వెళ్లారు. కొంతమంది ఆటోలలో ఉయ్యాలను కట్టి ఆడించగా, మరికొందరు పిల్లలను తమ భర్తలకు అప్పగించారు.

అప్పులు తీర్చలేక.. తిరుపతిలో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం
- బాధితులది కడప జిల్లా



నాగేంద్రరెడ్డి (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. కడపజిల్లాకు చెందిన వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతిచెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు.దీనికి సంబంధించి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కడప జిల్లా సిద్దవటం మండలం దేగనావాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు.పంటల సాగుకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. ఈసారైనా పంట చేతికి రాకపోతుందా? అప్పు తీర్చకపోతామా అన్న భావనతో అధిక వడ్డీలకు అప్పు చేశారు. కానీ, దురదృష్టం వెన్నాడి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాలేదు. మరోవైపు వడ్డీలతో కలుపుకొని అప్పులు పెరిగిపోయాయి.వీటిని ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరూ కలిసి చనిపోవాలని భావించారు. ఇద్దరు కుమార్తెలను ఇంటి వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్లొస్తామని చెప్పారు. ఈ నెల 9వ తేదీన తిరుపతికి వచ్చిన భార్యాభర్తలు పెద్దకాపులేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. ఆ రోజు నవ్వుతూ కలసి మెలసి తిరిగారు. మరుసటి రోజు గదిలోనే పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు.ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు.చికిత్స నిమిత్తం వీరిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ నాగేంద్ర రెడ్డి బుధవారం మృతి చెందారు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా స్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మునిరెడ్డి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక ఉన్న బలమైన కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బు కోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారిస్తున్నామని సీఐ చెప్పారు.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

- 15 పాఠశాలల బస్సులపై కేసులు
- తనిఖీలు కొనసాగుతాయన్న డీటీవో మురళీమోహన్



బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అతికానాజ్


తిరుపతి(జీవకోన), జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ ఆదేశాలతో అధికారులు కరకంబాడీ సర్కిల్, రామానుపల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డులో నాలుగు బృందాలుగా బుధవారం తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని 15 పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇందులో పర్మిట్ లేనివి 2, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేనివి 4, త్రైమాసిక పన్ను చెల్లించనవి 4, డ్రైవింగ్ లైసెన్స్ లేనిది ఒకటి ఉన్నాయి. వీటికి రూ.2లక్షలు అపరాధ రుసుం విధించారు. అగ్నిమాపక నియంత్రణ పరికరంలేని నాలుగు బస్సులకు జరిమానా విధించి, రసీదులు ఇచ్చారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, మోహన్‌కుమార్, ఆంజనేయప్రసాద్, రమణ నాయక్ పాల్గొన్నారు.

రవాణా శాఖ నిబంధనలు తప్పక పాటించాలి

మోటారు వాహనాల చట్టం 185జి ప్రకారం స్కూలు, కళాశాలల యజమాన్యాలు బస్సుల విషయంలో నిబంధనలు పాటించాలి. విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఎలాంటి భంగమూ కలగకుండా చూడాలి. ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సులను రోడ్లపై తిప్పరాదు.

\- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖ అధికారి

మొరాయిస్తున్న యోగాసనాల యాప్



తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి):ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో పిల్లలతో ఉదయం మూడు ఆసనాలు చేయించాలని ఆదేశించింది. వాటిని ఫొటోలు తీసి పొందుపరచడానికి ప్రత్యేక యాప్ రూపొందించింది. అయితే ఈ యాప్ మొరాయిస్తుండడంతో గంటల తరబడి పిల్లలు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోనే గడపాల్సి వస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి యాప్‌లో సాంకేతిక లోపాన్ని పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీ మండల అధ్యక్షుడిగా కిషోర్ నాయుడు



టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, కమిటీ సభ్యులతో నియోజకవర్గ పరిశీలకులు శివకోటారెడ్డి, జమీర్ బాషా

చిట్టమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల టీడీపీ అధ్యక్షుడుగా గణపర్తి కిషోర్ నాయుడు మూడోసారి ఏకగ్రీంగా ఎన్నిక య్యారని నియోజకవర్గ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటారెడ్డి తెలిపారు. బుధవారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, ఉపాధ్యక్షుడుగా రామిశెట్టి హరనాథ్, ప్రధాన కార్యదర్శులుగా గుంపర్ల చిన్నారావు, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఆరూరు గిరి నాయుడు, పల్లం సునీత, మండల కార్యదర్శులుగా కే.శ్రీనివాసులురెడ్డి, అంబటి సునీత, మాలపాటి అభిషేక్, కోశాధికారిగా సన్నారెడ్డి మనోజ్ రెడ్డిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడుగా రషీద్ భాషా, తెలుగు రైతు అధ్యక్షుడుగా దువ్వూరు సుధాకర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడుగా దువ్వూరు సాయిమౌళి, తెలుగు మహిళ అధ్యక్షురాలుగా ఆముతూరు శిరీషా, ఐటీడీపీ మండల అనుబంధ కమిటీ అధ్యక్షుడుగా గణపర్తి భరత్, ఎస్సీసెల్ అధ్యక్షుడుగా కల్లూరు మణి, బీసీ సెల్ అధ్యక్షుడుగా దొడ్డగ వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోపాలరెడ్డి, మస్తాన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, దువ్వూరు భారతమ్మ, కస్తూరయ్య, రాజేష్ రెడ్డి, గోపాల్ నాయుడు, బాబు నాయుడు, కంటేపల్లి దేవుడు, ఆరూరు గిరి నాయుడు, చెంచురామయ్య ఆచారి, బషీర్, బాబు, ధనంజయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలకు అభిప్రాయసేకరణ

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని షాదీమంజిల్‌లో బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికలపై అభిప్రాయసేకరణ జరిగింది. గూడూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటేశ్వరరెడ్డి, కోట మండల పరిశీలకుడు వల్లూరు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ, సంస్థాగత ఎన్నికలు జరిగాయి. మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు తమ అభిప్రా యాలను పార్టీ పరిశీలకులకు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్ష పదవికి మద్దాలి సర్వోత్తమరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, పాదర్తి కోటేశ్వర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను అధిష్ఠానా నికి పంపి మండల టీడీపీ అధ్యక్షుడిని ప్రకటిస్తామని పరిశీలకులు కోటేశ్వర రెడ్డి, రమేష్‌నాయుడు తెలిపారు.

విద్యార్థుల కోసం ఆటో ఏర్పాటు



ఆటోలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులతో డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డానియల్ చిల్డ్రన్స్ హోంలోని విద్యార్థులు చిల్లకూరు ప్రధాన ప్రాథమిక పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ఆటో ఏర్పాటు చేయడం జరిగిందని డిప్యూటీ డీఈవో సనత్ కుమార్ తెలిపారు. బుధవారం డానియల్ చిల్డ్రన్స్ హోం నుంచి పాఠశాలకు ఆటో ఏర్పాటు చేసి విద్యార్థులను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డానియల్ చిల్డ్రన్స్ హోం ప్రధాన పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు అవస్థలు పడుతుండడంతో ఉపాధ్యాయులు సహకారంతో ఆటో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, ఉపాధ్యాయులు సుందర రాధా, హన్నా కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి



విద్యార్థులతో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్య అందించడమే డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కాలనీలోని సంస్థ కార్యాలయం వద్ద బుధవారం పదో తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా విద్య అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో 136 మంది విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేయడం జరిగిందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యానికి కృషి



కార్తీక్‌ను సన్మానిస్తున్న బీజేవైఎం నేతలు, శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే తన ధ్యేయమని సైక్లిస్ట్ కార్తీక్ అన్నారు. కడప నుంచి కన్యాకుమారి వరకు కార్తీక్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో బీజేవైఎం నాయకులు, పాఠశాల సిబ్బంది కార్తీక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సైకిల్‌యాత్ర చేపట్టానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, మనోజ్‌కుమార్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో రహదారి నిర్మాణం సరికాదు

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసిన తమ పొలాలను వదులుకునే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. గ్రామ ప్రధాన వీధుల్లో స్టీల్ పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు వెళ్తుండడంతో తరచూ ప్రమా దాలు చోటుచేసుకునేవి. దీంతో 15 ఏళ్ల క్రితం గ్రామానికి వెలుపల పట్టా భూముల్లో తాత్కాలిక రహదారి నిర్మించారు. ప్రస్తుతం ఆ భూముల్లో శాశ్వతంగా బీటీ రోడ్డు పనులు చేపట్టడంతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డితో పాటు రైతులు అడ్డుకున్నారు. జిల్లా ఉన్నతాధి కారుల ఆదేశాలతో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, మండల సర్వేయర్ పూజిత భూములను పరిశీలించారు.

బాలిక కిడ్నాప్

వాకాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాల పురం గ్రామానికి చెందిన బాలిక(17) మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి మహేంద్రమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూడిరాయదొరువు పంచాయతీ చినతోట గ్రామానికి చెందిన మహేష్ కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు 20నుంచి కౌన్సెలింగ్

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఈనెల 20నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికృష్ణ బుధవారం తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మునిరత్నం నగర్‌లో బుధవారం ఉదయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీతో కలసి గుడ్‌మార్నింగ్ నాయుడుపేట కార్యక్రమాన్ని చేపట్టారు. మునిరత్నం నగర్‌లో ప్రతి వీధిలో తిరిగి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించడానికి చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కొన్ని వీధుల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో బోర్లు వేసి తాగునీరు అందించే ఏర్పాటు చేయాలని కమిషనర్ ఫజులుల్లాను ఆదేశించారు. అలాగే పింఛన్లు, రేషన్ కార్డులు, పక్కాగృహాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు రాజ శేఖర్‌రెడ్డి, పోలేరమ్మ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పసల గంగాప్రసాద్, ముత్యాలయ్య, రేవతి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



మునిరత్నంనగర్‌లో ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు దూరం

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతలు దూరమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మాలయకోట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ద్వారా శరీరంలోని ప్రతి అవయవానికి సంబంధించిన రుగ్మతల నివారణతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించ వచ్చన్నారు. అనంతరం మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పోలేరమ్మ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు

భారత్ వికసిస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎద్దల నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో వికసిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలచ్చూరు గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసిం హులు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, రమణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

ఓజిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఓజిలి మండల బీజేపీ శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నాయి. బీజేపీ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు రవీంద్రరాజు, శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్ సేవలు స్ఫూర్తిదాయకం



రాంగోపాల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కరుణకుమారి, సిబ్బంది

బాలాయపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగ మాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ రాం గోపాల్ సేవలు స్ఫూర్తిదాయకమని ప్రస్తుత ప్రిన్సిపాల్ కరుణకుమారి అన్నారు. ఇక్కడ పనిచేసి బదిలీ అయిన రాంగోపాల్‌ను బుధవారం సనానించారు. కార్యక్రమంలో మునీంద్ర, మల్లీశ్వరి, విజయమ్మ, సుబ్ర హ్మణ్యం, శ్రీలక్ష్మి, భార్గవి, ఆదిలక్ష్మి, నవీన్, వెంకటేశ్వర్లు, మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో శిక్షణ తరగతులు

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ శిక్షణ తరగతులు ప్రారం భమయ్యాయి. బెంగళూరుకు చెందిన డైనమిక్ జనరిక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గవ ఏడాది చదువుతున్న విద్యార్థులకు డిజైన్‌పై ఆరు వారాలు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. డైనమిక్ జనరిక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు మామిళ్ల నాగార్జున మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిజైన్ల ప్రాముఖ్యం గురించి వివరించారు. కార్యక్ర మంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్, కోఆర్డినేటర్ అశోక్‌కుమార్‌రెడ్డి, అమర్‌దుర్గా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయురాలు నవమణితో పూర్వ విద్యార్థులు

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎంజీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1963-68 విద్యా సంవత్సరంలో చదువు కున్న విద్యార్థులంతా ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలక రించుకుని నాటి తీపిజ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఉపాధ్యా యురాలు నవమణిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ రవి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం ట్రస్ట్ కార్యాలయం ప్రారంభం

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణంలో ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ షాదాబ్‌జేబ్ ఖాన్ బుధవారం ప్రారంభిం చారు. ముందుగా స్థానిక రైల్వేస్టేషన్‌లో డీఐజీకి ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాజుద్దీన్ స్వాగతం పలికి సన్మానించారు. డీఐజీ మాట్లాడుతూ తాజుద్దీన్ అబ్దుల్‌కలాం పేరిట ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నరేంద్రనాథ్ చౌదరి, సురేంద్రబాబు, ఆరీఫ్, ఫయాజ్, శ్రీనివాసులు, మఖ్బుల్, ధనుష్‌కృష్ణ చౌదరి, ప్రసాద్‌గౌడ్, మనోజ్‌కుమార్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

బాలాయపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వెలుగు ఏపీఎంగా వై.కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పోలమ్మను వాకాడు మండలానికి బదిలీ కాగా, నెల్లూరు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న కిరణ్ ఇక్కడకు వచ్చారు.

గ్యాస్ పైప్‌లైన్ మార్గంలో తవ్వకాల నిషేధం

ఓజిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఏజీపీ గ్యాస్ పైప్‌లైన్ మార్గంలో తవ్వకాలను నిషేధించినట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న గ్యాస్ స్టేషన్ నుంచి నాయుడుపేట, మేనకూరు పారిశ్రామికవాడతో పాటు ఓజిలి మండలం అత్తివరం, గూడూరు ప్రాంతాల్లో గ్యాస్ పైప్‌లైన్ ఉందన్నారు. ఈ మార్గంలో ఏవైనా తవ్వకాలు చేపట్టాలంటే గ్యాస్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

పాఠశాల విలీనాన్ని ఆపండి



రావులపాడు పాఠశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను నెలబల్లి పంచాయతీ భీమవరానికి తరలించడం తగదని రావులపాడు గ్రామస్థులు బుధవారం నిరసన తెలిపారు. తమ ఊర్లో ఉన్న 3, 4, 5 తరగతులను భీమవరంలోని ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయండం అన్యాయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రావులపాడు పాఠశాలకు ఉపాధ్యాయులు లేక అవస్థలు పడ్డామన్నారు. ఇప్పుడు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమవరం గ్రామానికి విద్యార్థులను తరలించడంపై సరికాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

వెంకటగిరి టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికా రులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులను అభినందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి పంచా యతీలోని దక్షిణపాలం, కొండమిట్ట గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రా ల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు చెన్నూరు కోటేశ్వరి, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఐదేళ్ల చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి సమీప ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయించారు. సూపర్‌వైజర్ కవిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బంగారు పేటకు చెందిన సత్తుల బాలాజీ(65) తెలుగుగంగ లింకు కాలువలో స్నానానికి వెళ్లి మంగళవారం మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.



బాలాజి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

నేడు పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య నేడు (గురువారం) పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. చెన్నై - గూడూరు మార్గంలోని కవర్‌పేట, గుమ్మిడిపూడి స్టేషన్ల మధ్యలో ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ మార్పు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు 6 గంటల పాటు పనులను చేపట్టనున్నారు. ఆ సమయంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50కు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 8.35, 10.15 గంటలకు, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు వచ్చే ఈఎంయూ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 11.45, మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40 వచ్చే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30, 3.15, బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి. అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



సీపీఐ జిల్లా మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళి, రత్నమ్మ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వ విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టులో సూళ్లూరుపేట వేదికగా జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అవినీతి మితిమీరిపోయిందన్నారు. చంద్రబాబు పాలన ఏడాది పూర్తయినా హామీ లను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పార్థసారధి, సుధాకర్ రెడ్డి, విశ్వనాథ్, ఆనంద్, శశికుమార్, రాధాకృష్ణ, నాగేంద్ర, చలపతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరుఅర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య, ఇంజనీ రింగ్ కార్మికులు పర్యావరణ పరిరక్షణను కాపాడేందుకు, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు సేవలందిస్తున్నారన్నారు. వీరికి ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. ఇదే డిమాండ్‌తో గురు వారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు 23వ తేదీ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంక టేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, మణెమ్మ, నారాయణమ్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాల యం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మ ణ్యం, పి.రమణయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరిలో నల్లి నివారణకు చర్యలు చేపట్టాలి



వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జున, ఏవో గణేష్

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎడగారు వరిపంటలో నల్లి నివారణకు చర్యలు తీసుకోవాలని నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. మండలంలోని అన్నమేడు, పుదూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరిలో నల్లి సోకిన పైరు ఆకులపై తెల్లటి చుక్కలు ఏర్పడుతాయ న్నారు. దీని నివారణకు ఓబేరాన్ లేక ఓమిట్ లేక ఫ్రోఫైనోఫోస్ మందుల్లో ఏదో ఒకటి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గణేష్, వీఏఏ చెంగల్‌రాజు, వెటర్నరీ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.